- aruhi group
www.mahaaprabha.com

నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

ఆదివారం
15-11-2026

సంపుటి : 01 సంచిక : 232 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 232 NAMASTEY MAHAAPRABHA



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

అండర్-19 ఆసియా కప్

విజేతగా భారత్

- పాకిస్థాన్‌పై ఒక్క వికెట్ తేడాతో గెలిచిన భారత్
- రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి అండర్-19 ఆసియా కప్ కైవసం
- యువ జట్టు అద్భుత ప్రదర్శనపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు
- ఆఖరి బంతికి బౌండరీ బాది జట్టును గెలిపించిన మోహిత్ ఉల్వా
- ఆకట్టుకున్న కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ, ఆర్యవీర్ సెహ్వాగ్

పాకిస్థాన్‌తో ఆఖరి బంతి వరకు ఉత్కంఠగా సాగిన అండర్-19 ఆసియా కప్ ఫైనల్లో భారత యువ జట్టు ఒక్క వికెట్ తేడాతో అద్భుత విజయం సాధించి రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి ట్రోఫీని కైవసం చేసుకుంది. 338 పరుగుల భారీ లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో చివరి బంతికి మూడు పరుగులు అవసరమైన వేళ మోహిత్ ఉల్వా బౌండరీ బాది భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ, ఆర్యవీర్ సెహ్వాగ్ కీలక ఇన్నింగ్స్‌లతో ఆకట్టుకోగా, యువ జట్టు పోరాటపటిమను ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసించారు. ఈ విజయం ఎంతోమంది యువ క్రికెటర్లకు స్ఫూర్తినిస్తుందని అభినందించారు.

03





అది ముమ్మాటికీ రేవంత్ రక్షణ సేన

- ముఖ్యమంత్రి సౌజన్యంతోనే కవిత సొంత పార్టీ
- కాంగ్రెస్‌కు టీఆర్ఎస్ నాలుగో అనుబంధ సంస్థ
- 'ఆడికోర్ ఇన్‌ఫ్రా'లో రేవంత్, కవిత డైరెక్టర్లు
- సృజన్‌రెడ్డి కో డైరెక్టర్
- ప్రతిపక్షంపై దాడి దుర్మార్గం
- ఆమె స్క్రిప్ట్‌నే సిద్దిపేటలో రేపు రేవంత్ చదువుతారు
- బీఆర్ఎస్ అధికార ప్రతినిధి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

హైదరాబాద్, నవంబర్ 14(మహా ప్రభ)
'మాజీ ఎమ్మెల్సీ కవిత ఏర్పాటుచేసిన తెలంగాణ రక్షణ సేన పార్టీ.. ముమ్మాటికీ రేవంత్ రక్షణ సేన. సీఎం సౌజన్యం, పాంచజన్యం ఎజెండాతోనే ఆ పార్టీ పురుడుపోసుకొన్నది. కాంగ్రెస్‌కు అది నాలుగో అనుబంధ సంఘంగా కొనసాగుతూ రేవంత్‌రెడ్డిపై ఈగవాలనివ్వకుండా కాపాడుతున్నది' అని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. ఇందుకు సంబంధించిన ఆధారాలను బయటపెడుతానని ఆయన ప్రకటించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో శనివారం కార్పొరేషన్ -మిగతా 3 లో

2014లోనే భారత ప్రజాస్వామ్య ధ్వంసం

ఫాసిస్టు శక్తులు గందరగోళం సృష్టిస్తున్నాయి

- దేశంలో 14 కోట్ల మంది ఓటర్లు ఉనికిలో లేరా?
- మహారాష్ట్రలో 3 నెలల్లో 70 లక్షల మంది కొత్త ఓటర్లు ఎలా వచ్చారు?
- 2024 లోక్‌సభ ఎన్నికలకు విశ్వసనీయత లేదు
- భారత్ సమ్మిట్‌లో రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు
- ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రపంచ దేశాల బాధ్యతని ప్రకటన

భారత ప్రజాస్వామ్యం 2014 నుంచే బలహీనపడటం ప్రారంభమైందని, గత దశాబ్ద కాలంగా ఫాసిస్టు శక్తులు వ్యవస్థలను దెబ్బతీస్తూ గందరగోళం సృష్టిస్తున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. 2024 లోక్‌సభ ఎన్నికల విశ్వసనీయతపై ప్రశ్నలు లేవనెత్తిన ఆయన.. మహారాష్ట్రలో కేవలం మూడు నెలల వ్యవధిలో 70 లక్షల మంది కొత్త ఓటర్లు ఎలా చేరారని నిలదీశారు. భారత ప్రజాస్వామ్య పరిరక్షణ దేశానికే పరిమితమైన అంశం కాదని, ప్రపంచ దేశాలకూ బాధ్యత ఉందని హైదరాబాద్‌లో జరిగిన భారత్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో స్పష్టం చేశారు.



03





03

హసీనా భద్రతకు హామీ ఇస్తేనే..!

- న్యాయమైన విచారణకు భారత్ పట్టుబాటు
- మరణశిక్షపై అప్పీల్‌కు అవకాశం కల్పించాలి
- బంగ్లాదేశ్ ప్రభుత్వానికి రెండు షరతులు
- తిరుగు ప్రయాణ బాధ్యత సైన్యానిదే కావాలని ప్రతిపాదన
- ఢిల్లీకి ప్రత్యేక విమానం పంపాలని సూచన
- సరిహద్దులో అప్పగింతకూ మరో ప్రతిపాదన
- అంతర్జాతీయ పర్యవేక్షణలో విచారణ జరగాలని డిమాండ్
- డిసెంబర్‌లో స్వదేశానికి వస్తానన్న హసీనా

నింగిలోకి స్టార్‌షిప్.. సముద్రంలో పేలిన బూస్టర్!



03

పాలస్తీనాకు భారత్ సహా 151 దేశాల మద్దతు

- ఐరాస జనరల్ అసెంబ్లీలో కీలక తీర్మానానికి ఆమోదం
- పాలస్తీనా ప్రజల హక్కులకు భారత్ మద్దతు
- ఆక్రమిత సిరియాలోని గోలాన్ అరబ్ ప్రజలకూ అండ
- సహజ వనరులపై శాశ్వత హక్కులను ధ్రువీకరించిన తీర్మానం
- భారత్‌తో పాటు మొత్తం 151 దేశాల అనుకూల ఓటు



03

మైక్రోసాఫ్ట్ సేవలు పునరుద్ధరణ

- 74 దేశాల్లో రెండు రోజుల పాటు నిలిచిన సేవలు
- ఔట్‌లుక్, టీమ్స్, మైక్రోసాఫ్ట్ 365పై ప్రభావం
- భారత్ సహా పలు దేశాల్లో వినియోగదారులకు ఇబ్బందులు
- విమానయాన, బ్యాంకింగ్, ఆరోగ్య సేవలకు అంతరాయం
- సాంకేతిక సమస్యను పరిష్కరించామన్న సంస్థ
- సైబర్ దాడి కారణం కాదని స్పష్టీకరణ



03

ఇప్పుడు చేయాల్సింది పోరాటమే



సామాజిక న్యాయం, సమాన అవకాశాల కోసం ఐక్య ఉద్యమం

- రాహుల్ నాయకత్వంలో దేశంలో మార్పు తీసుకొస్తాం
- సంపన్నుల కోసం కాదు.. సామాన్యుల కోసం ప్రభుత్వాలు పనిచేయాలి
- ప్రజాస్వామ్య పరిరక్షణకు ప్రపంచ శక్తులన్నీ ఏకం కావాలి
- 70 దేశాల నుంచి వెయ్యిమందికి పైగా ప్రతినిధులకు ఆహ్వానం
- రాజ్యాంగాన్ని బలహీనపరిచే శక్తులతో పోరాటం
- దళితులు, మైనారిటీలు, ఓబీసీలకు సామాజిక న్యాయం
- భారత్ సమ్మిట్‌లో సీఎం రేవంత్‌రెడ్డి పిలుపు

హైదరాబాద్, నవంబర్ 14(మహా ప్రభ)
ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణ, సామాజిక న్యాయం, సమాన అవకాశాల సాధన కోసం ప్రపంచవ్యాప్తంగా ఒకే ఆలోచనా ధోరణి కలిగిన ప్రజాస్వామ్య శక్తులన్నీ ఐక్యంగా పోరాడాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థను బలోపేతం చేసేందుకు ఒకవైపు శక్తులు ప్రయత్నిస్తుంటే, మరోవైపు రాజ్యాంగాన్ని బలహీనపరిచి నియంతృత్వ ధోరణులను రుద్దాలని చూస్తున్నాయని విమర్శించారు. -మిగతా 3 లో



03

మోదీ ఫోన్లు ట్యాప్ చేయరు..

- ఫోన్ ట్యాపింగ్‌పై శామ్ పిట్రోడా కీలక వ్యాఖ్యలు
- ప్రధాని మోదీ ఇలాంటి చర్యలకు పాల్పడతారని అనుకోవడం లేదని వెల్లడి
- తన ఫోన్ ట్యాప్ అవుతోందని భావించడం లేదని స్పష్టీకరణ
- కేంద్రంపై రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలతో భిన్నాభిప్రాయం
- తమ మధ్య పరస్పర గౌరవం ఉందన్న పిట్రోడా

హామీలు ఘనం.. అమలు జీరో

- కాంగ్రెస్ 420 వాగ్దానాలపై రాహుల్ సమాధానం చెప్పాలి
- బీసీలకు రూ.లక్ష కోట్ల హామీ.. రూ.5 వేల కోట్లలోపే ఖర్చు
- తెలంగాణకు కాంగ్రెస్ చేస్తున్న ద్రోహానికి అంతులేదు
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 14(మహా ప్రభ)
కాంగ్రెస్ ప్రభుత్వ హామీలు ఘనం.. అమలు మాత్రం జీరో అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ ఎన్నికల మేనిఫెస్టో 'అభయ హస్తం' పచ్చి అబద్ధాలతో కూడుకున్నదని, అందులో పేర్కొన్న 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీల అమలుపై రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఎక్స్ వేదికగా కాంగ్రెస్ హామీల అమలుపై విమర్శలు గుప్పించారు. బీసీలకు రూ.లక్ష కోట్ల బడ్జెట్ కేటాయిస్తామని హామీ ఇచ్చి, మూడేళ్లలో రూ.5 వేల కోట్లలోపే ఖర్చు చేశారని ఆరోపించారు. బీసీలకు విద్య, ఉద్యోగాలు, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో -మిగతా 3 లో



నకిలీ కోర్టు ఉత్తర్వులతో పరేషాన్!

న్యాయవ్యవస్థకే సవాలుగా మారిన ఏఐ మాయగాళ్లు



న్యూఢిల్లీ, నవంబర్ 14(మహా ప్రభ)

: శ్రీనగర్‌కు చెందిన 12వ తరగతి విద్యార్థి(17 ఏండ్లు) ఎక్స్(ఇదివరకటి ట్విట్టర్) ప్లాట్‌ఫామ్‌కు నకిలీ సోషల్ మీడియా నోటీసులను పంపినట్టు ఈ నెల 6న ఢిల్లీ హైకోర్టులో జరిగిన విచారణలో వెల్లడైంది. ఢిల్లీ పోలీసుల పేరుతో జారీ చేసినట్టు కనిపిస్తున్న ఆ నోటీసులు నకిలీవని తమ అంతర్గత విచారణలో తేలిందని ఎక్స్ సంస్థ కోర్టుకు తెలియచేసింది. ఢిల్లీ పోలీసుల గుర్తింపును ఒక అపరిచిత వ్యక్తి మోసపూరితంగా ఉపయోగించుకొని ఇంటర్నెట్ ఫ్రీడమ్ ఫౌండేషన్(ఐఎఫ్ఎఫ్), సాఫ్ట్‌వేర్ ఫ్రీడమ్ లా సెంటర్(ఎస్ఎఫ్ఎల్‌సీ)లకు చెందిన ఖాతాలను నిలిపివేయాలని కోరినట్టు ఎక్స్ కోర్టుకు తెలియచేసింది. ఆ నోటీసుల ఆధారంగా తాము ఖాతాలను నిరోధించలేదని ఎక్స్ స్పష్టం చేసింది. ఐఎఫ్ఎఫ్, ఎస్ఎఫ్ఎల్‌సీ సంస్థలకు అందిన ఆ నకిలీ నోటీసులను ఢిల్లీ పోలీసు అధికారిగా నటించిన ఎవరో పంపారని పేర్కొంది. ఈ ఉత్తర్వుల వెనుక ఉన్న న్యాయవాది, బీజేపీ మాతృసంస్థ ఆర్ఎస్ఎస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నట్టు ఎస్ఎఫ్ఎల్‌సీ పేర్కొంది. కాగా, ఎఫ్ఎఫ్ సంస్థ ఆర్ఎస్ఎస్‌కు లేఖ రాసినప్పటికీ ఎటువంటి స్పందన రాలేదు. మరోవైపు ఎస్ఎఫ్ఎల్‌సీ సంస్థ ఢిల్లీ పోలీసులను సంప్రదించగా తాము ఎటువంటి నోటీసులు జారీ చేయలేదని వారు స్పష్టం చేశారు. నకిలీ వ్యక్తిని గుర్తించేందుకు తాము కూడా ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశామని ఎక్స్ తరఫు న్యాయవాదులు కోర్టుకు తెలిపారు. ఢిల్లీ పోలీసుకు చెందిన క్రైమ్ బ్రాంచ్ గుర్తు తెలియని వ్యక్తులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసి ఫోర్జరీ ఘటనపై దర్యాప్తు చేపట్టింది.

నకిలీ కోర్టు ఉత్తర్వులు

ఇలా ఉండగా నకిలీ కోర్టు ఉత్తర్వులను ప్రచారం చేయడం ద్వారా వెబ్‌సైట్‌లను తొలగించిన రెండు ఉదంతాలను రాయిటర్స్ వార్తాసంస్థ వెలికి తీసింది. జూలై, సెప్టెంబర్ నెలల్లో ఇవి జరిగినట్టు తెలుస్తున్నది. అలహాబాద్ హైకోర్టు, రాజస్థాన్ హైకోర్టు పేరుతో జారీ అయినట్టు కనిపిస్తున్న ఆ ఉత్తర్వులు నకిలీవని ఆ సంస్థ గుర్తించింది. దీనిపై అలహాబాద్ హైకోర్టు రిజిస్ట్రీ విచారణ ప్రారంభించి, ఆ ఉత్తర్వు నకిలీదని నిర్ధారించి, ఈ నెల 6న పోలీసులకు ఫిర్యాదు చేసింది. రాయిటర్స్ కథనం ప్రకారం ఈ ఈమెయిల్స్‌ను పంపిన వ్యక్తులు తమను తాము ఆర్యన్ చౌదరి(రాజస్థాన్ హైకోర్టు అడ్వకేట్-ఆన్-రికార్డ్ అని చెప్పుకున్న వ్యక్తి), కార్తికేయ పాండే(ఆగస్టు 22న అలహాబాద్ హైకోర్టుకు చెందిన నకిలీ ఉత్తర్వును అధికారులకు పంపిన వ్యక్తి)గా పేర్కొన్నారు.

న్యాయమూర్తుల్లో ఆందోళన

కృత్రిమ మేధ(ఏఐ) ద్వారా రూపొందించిన న్యాయపరమైన ఉత్తర్వుల దుర్వినియోగం ప్రపంచవ్యాప్తంగా న్యాయమూర్తుల్లో ఆందోళనలను రేకెత్తించింది. జూలైలో ఉనికిలో లేని తీర్పులపై ఆధారపడిన ట్రిబ్యునల్ ఉత్తర్వులను భారత సుప్రీంకోర్టు రద్దు చేయగా ఇటీవల ఒక అమెరికా న్యాయమూర్తి కల్పిత న్యాయపరమైన తీర్పులను ఉపయోగించినందుకు న్యాయవాదులను అనర్హులుగా ప్రకటించారు. ఇదిలా ఉండగా పశ్చిమ రాజస్థాన్, ఉత్తర ఉత్తర ప్రదేశ్ హైకోర్టు నుంచి వచ్చినట్టుగా భావిస్తున్న కోర్టు ఉత్తర్వుల కాపీలను ఈమెయిల్ ద్వారా జతచేసి, డజన్ల కొద్దీ వెబ్‌సైట్‌లను తొలగించాలని ఆదేశిస్తూ భారత టెలికమ్యూనికేషన్ల శాఖ జూలై 21, సెప్టెంబర్ 2 తేదీలలో ఉత్తర్వులను జారీచేయడం గమనార్హం.

రాజస్థాన్‌లోని సూరత్‌గఢ్‌లో ఇటీవల వెలుగుచూసిన మరో ఘటనలో పెరోల్‌పై జైలు నుంచి బయటకు వచ్చి షరతులను ఉల్లంఘించిన తన తండ్రిని కాపాడేందుకు కెనడాకు చెందిన ఒక ఐటీ ఇంజనీర్ నకిలీ పత్రాలతో న్యాయవ్యవస్థను మోసం చేయడానికి ప్రయత్నించాడు. ఆ టెకీ ఏఐని ఉపయోగించి రాజస్థాన్ హైకోర్టుకు చెందిన రాజ ముద్రలను యథాతథంగా ఫోర్జరీ చేశాడు. ఆ తర్వాత అతను అధికారిక పోర్టల్‌ను హ్యాక్ చేసి తాను తయారుచేసిన నకిలీ 30 రోజుల బెయిల్ ఉత్తర్వులను నేరుగా ప్రభుత్వ వ్యవస్థలోకి అప్‌లోడ్ చేశాడు. అయితే రిజిస్ట్రీలో తేడాలు అనుమానాలను రేకెత్తించడంతో వారి బండారం బయటపడింది. పంజాబ్‌లోని లూథియానాలో తండ్రీకొడుకులిద్దరూ అరెస్టు అయ్యారు.

మూడేండ్లలో మానవాళిని ఏఐ తుడిచిపెట్టేయగలదు: హింటన్

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) మానవాళిని తుడిచిపెట్టేసి ప్రపంచాన్ని తన ఆధీనంలోకి తీసుకునే ప్రమాదం మూడేండ్లలోనే ఉన్నదని ఏఐ గాడ్ ఫాదర్, నోబెల్ బహుమతి గ్రహీత జెఫ్రీ హింటన్ హెచ్చరించారు. 'ఏఐ మనకంటే తెలివైనదిగా మారుతుందని, దాని గురించి కలవరపడవలసి ఉంటుందని నేను చెప్పుకొస్తున్నాను. ఇంతకుముందు దీనికి 10 ఏండ్లు పడుతుందని అనుకున్నాను. కానీ ఇప్పుడు 18 నెలల్లోనే జరిగే అవకాశం ఉన్నది. ఇది భయపెడుతున్నది' అని ఆయన చెప్పారు. మనుషులకు బదులు ఏఐ స్వయంగా నిర్ణయాలు తీసుకునే స్థితి రావచ్చునని తెలిపారు.

బెట్టింగ్ సైట్ల బ్లాక్ వ్యవహారం.. టెలికం కార్యదర్శికి పీఎంవో పిలుపు

నకిలీ కోర్టు ఉత్తర్వుల ఆధారంగా 100కు పైగా వెబ్‌సైట్‌లను తొలగించాలని ఆదేశించిన వ్యవహారంపై తమ ఎదుట హాజరై వివరణ ఇవ్వాలని ప్రధాని మోదీ కార్యాలయం టెలికమ్యూనికేషన్స్ కార్యదర్శి అమిత్ అగర్వాల్‌ను శనివారం కోరినట్టు అధికారులు తెలిపారు. కేవలం ఏఐ ఉత్తర్వులు చూసి వారీ చర్య తీసుకున్నారా? దీని వెనుక ఎవరిదైనా హస్త ముందా అని అధికారులు ఆరా తీస్తున్నారు.

।కమాండర్‌ను చంపుతానని సోషల్ మీడియాలో బెదిరింపు.. జవాన్ తొలగింపు



శ్రీనగర్:నవంబర్ 14(మహా ప్రభ)

తన బెటాలియన్ కమాండర్‌ను చంపుతానని పారామిలిటరీ జవాన్ సోషల్ మీడియా పోస్ట్‌లో బెదిరించాడు. దీంతో అధికారులు దీనిపై దర్యాప్తు చేశారు. చివరకు ఆ జవాన్‌ను సర్వీస్ నుంచి తొలగించారు. అస్సాంకు చెందిన పినాక్ నాథ్, సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్)లో ప్రొబేషనరీ కానిస్టేబుల్‌గా చేరాడు. జమ్ముకశ్మీర్‌లోని దోడా జిల్లాలో ఉన్న సీఆర్పీఎఫ్ 33వ బెటాలియన్‌లోని ఆల్ఫా కంపెనీలో అతడు పోస్టింగ్ పొందాడు. అయితే జవాన్ పినాక్ నాథ్ ఇటీవల సోషల్ మీడియాలో ఒక పోస్ట్ పెట్టాడు. తన కంపెనీ బెటాలియన్ కమాండర్‌ను చంపి తాను చనిపోతానని అందులో బెదిరించాడు. ఇటీవల మరో దళానికి చెందిన ఒక జవాన్ తన సర్వీస్ వెపన్‌తో సీనియర్‌ను, సహచరులను కాల్చి చంపిన సంఘటనను అతడు ప్రస్తావించాడు.కాగా, సీఆర్పీఎఫ్ కానిస్టేబుల్ పినాక్ నాథ్ సోషల్ మీడియా పోస్ట్‌ను ఆ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ తీవ్రంగా పరిగణించారు. దీనిపై విచారణ జరిపారు. ఆ తర్వాత సర్వీస్ నిబంధనల మేరకు సీఆర్పీఎఫ్ జవాన్ పినాక్ నాథ్‌ను శుక్రవారం విధుల నుంచి తొలగించారు. క్రమశిక్షణను ఉల్లంఘించడం, బెదిరింపులకు పాల్పడటం వంటివి సహించబోమని సీఆర్పీఎఫ్ అధికారులు పేర్కొన్నారు. మరోవైపు సీఆర్పీఎఫ్ నుంచి తొలగించిన తర్వాత పినాక్ నాథ్ సోషల్ మీడియాలో ఒక వీడియోను పోస్ట్ చేశాడు. సస్పెండ్ లెటర్‌ను చేతిలో పట్టుకుని కనిపించాడు. తనను సర్వీస్ నుంచి తొలగించారంటూ అతడు ఏడ్చాడు.

అపరాజిత మాత ఆలయంలో చండీ మహాయాగం.

ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్‌రెడ్డి.



మెదక్ జిల్లా -14నవంబర్ (మహాప్రభ).

మెదక్ పట్టణంలోని 5వ వార్డు ఇంద్రపురి కాలనీలోని శ్రీ అపరాజిత మాత దేవాలయ ప్రథమ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన చండీ మహాయాగం,లక్ష పుష్పార్చనలో మాజీ డిప్యూటీ స్పీకర్ పద్మ దేవేందర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ ఆరేళ్ల.మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్, స్థానిక కౌన్సిలర్ మామిళ్ల ఆంజనేయులు,మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కృష్ణారెడ్డి, కౌన్సిలర్ జుబెర్ అహ్మద్,మాజీ కౌన్సిలర్ లు ఆర్కే. శ్రీనివాస్,మాయ మల్లేశం,నాయకులు ప్రభు రెడ్డి, కృష్ణ గౌడ్,కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

భారత్ సమ్మిట్ ముగింపు సమావేశంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్





దేవరకొండ
నవంబర్ 14(మహాప్రభ)

కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ , తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలతో కలిసి హైదరాబాద్‌లోని హెచ్ఐసీసీ (హెచ్ ఐసిసి), నోవాటెల్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్--2026ముగింపు సమావేశంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ పాల్గొన్నారు.ప్రపంచ దేశాల మధ్య ప్రజాస్వామ్య, సామాజిక న్యాయం, సమానత్వ విలువల బలోపేతమే భారత్ సమ్మిట్ లక్ష్యం
హైదరాబాద్ వేదికగా రెండు రోజుల పాటు నిర్వహించిన భారత్ సమ్మిట్--2026లో దేశ, విదేశాలకు చెందిన రాజకీయ ప్రముఖులు, విధాన నిర్ణేతలు, మేధావులు, వివిధ రంగాల ప్రతినిధులు పాల్గొని ప్రపంచ భవిష్యత్తుకు సంబంధించిన కీలక అంశాలపై చర్చించారు. సుమారు 70 దేశాలకు చెందిన ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరుకావడం ప్రజాస్వామ్య పరిరక్షణ, సామాజిక మరియు ఆర్థిక న్యాయం, వాతావరణ మార్పులు, మహిళా సాధికారత, యువత భవిష్యత్తు, కృత్రిమ మేధస్సు (ూ1) అంతర్జాతీయ సంబంధాలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మార్పులు వంటి అనేక కీలక అంశాలపై ఈ సదస్సులో చర్చలు జరిగాయి. ఈ సందర్భంగా ముగింపు సమావేశంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ భారతదేశ భవిష్యత్తు, ప్రపంచ దేశాలతో భారత్ సంబంధాలు, ప్రజాస్వామ్య విలువలు, శాంతియుత సహజీవనం, సమానత్వం వంటి అంశాలపై తన దార్శనికతను వివరించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రం అంతర్జాతీయ స్థాయి సమావేశాలకు వేదికగా నిలవడం, ప్రపంచ దేశాల ప్రతినిధులను హైదరాబాద్‌కు ఆహ్వానించి వివిధ రంగాల్లో చర్చలకు అవకాశం కల్పించడం రాష్ట్రానికి గర్వకారణమని రాహుల్ గాంధీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ తో పాటు పలువురు రాష్ట్ర మంత్రులు, పార్లమెంట్ సభ్యులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

గిరిజన బాలికపై కాంగ్రెస్ ఎమ్మెల్యే లైంగిక దాడి!

చదివిస్తానని ఇంటికి తెచ్చి ఘాతుకం.. కేసు నమోదు



రాంచీనవంబర్ 14(మహా ప్రభ)

జార్ఖండ్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యేపై లైంగిక దాడి కేసు నమోదైంది. తన ఇంట్లో పనిచేస్తున్న గిరిజన బాలిక(14)పై ఎమ్మెల్యే భూషణ్ బరా లైంగిక దాడికి పాల్పడి ఆమెను గర్భవతిని చేశాడని, ఈ విషయం ఎవరికైనా చెబితే ప్రాణం తీస్తానని బెదిరించాడన్న బాధితురాలి ఆరోపణలతో అతనిపై రాంచీలో పోక్సో కింద కేసు నమోదైంది.బాధితురాలు ధుర్వా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వైద్య పరీక్షల కోసం ఆమెను దవాఖానకు పంపించి, వాంగ్మూలం నమోదు చేశారు. ఎమ్మెల్యేను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆందోళన నిర్వహించగా, దర్యాప్తు పూర్తయ్యే వరకు సంయమనం పాటించాలని కాంగ్రెస్ కోరింది. పాఠశాలలో చేర్పిస్తాననే హామీతో ఎమ్మెల్యే కుటుంబం మేలో తనను వారి ఇంటికి తీసుకొచ్చి పని మనిషిగా వాడుకున్నారని ఆ బాలిక తెలిపింది.

తెలుగుపల్లి ప్రాథమిక పాఠశాలలో ఘనంగా జాతీయ బాలల దినోత్సవ వేడుకలు

దేవరకొండ నవంబర్ 14(మహా ప్రభ)



జాతీయ బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని దేవరకొండ మండలం తెలుగుపల్లి గ్రామ ప్రైమరీ పాఠశాలలో శుక్రవారం జాతీయ బాలల దినోత్సవ వేడుకలను అత్యంత ఘనంగా నిర్వహించారు.పాఠశాల ప్రధానోపాధ్యాయులు జావిదల్లి అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలకు తెలుగుపల్లి గ్రామ సర్పంచ్ చాట్ల రమాదేవి రాములు ముఖ్య అతిథిగా విచ్చేశారు. భారతదేశ ప్రథమ ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ వేడుకల్లో భాగంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి అంకం శ్రీధర్, వార్డు సభ్యులు చేపూరి పుష్ప, ప్రముఖులు చాట్ల శంకర్, పల్లె సైదులు, ఏకుల పర్వతాలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అతిథులందరూ చిన్నారులకు బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తూ, నేటి బాలలే రేపటి భావి భారత పౌరులు క్రమశిక్షణ అలవరుచుకొని చదువులో ముందు ఉండాలని, పిల్లలు దేశ భవిష్యత్తుకు పునాదులని, ఉన్నత లక్ష్యాలతో ఎదగాలని ఆకాంక్షించారు. చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేసి ఉత్సాహపరిచారు.

శబరిమల ప్రసాదం ఇంటికే డెలివరీ

స్పీడ్ పోస్ట్ పార్సిల్ ద్వారా భక్తులకు సదుపాయం



తిరువనంతపురం నవంబర్ 14(మహా ప్రభ)

శబరిమల వచ్చే భక్తులు అరవణ పాయసం, అప్పం, ఇతర ప్రసాదాలను ఇండియా పోస్ట్ ద్వారా తమ ఇండ్లకే తెప్పించుకునే సదుపాయం త్వరలో అందుబాటులోకి రానున్నది. ట్రావన్‌కోర్ దేవస్వం బోర్డ్‌తో కలిసి కొండపై ఆలయంలో 24 గంటల ప్రత్యేక పార్సిల్ బుకింగ్ కౌంటర్‌ను ఇండియా పోస్ట్ ఏర్పాటు చేస్తున్నది.ఈ నెల 17న ప్రారంభం కానున్న -మకరవిళక్కు యాత్రా సీజన్ కోసం ఈ సదుపాయాన్ని ప్రారంభిస్తున్నట్టు ఇండియా పోస్ట్ వెల్లడించింది. పోస్టల్ శాఖ స్పీడ్ పోస్ట్ ద్వారా దేశవ్యాప్తంగా భక్తుల ఇండ్లకు ప్రసాదాలు చేరవేయనున్నారు. భక్తులు ఆలయంలో ఉన్నప్పుడే ఆన్‌లైన్‌లో ప్రసాదాలు బుక్ చేసుకోవచ్చు. తద్వారా వారు ఇంటికి చేరుకునే సమయానికి పార్సిల్స్ కూడా డెలివరీ అవుతుంది.

ఎల్లారెడ్డి గురుకుల పాఠశాలలో ఘనంగా బాలల దినోత్సవం

-అంబేద్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో వేడుకలు..

-విద్యార్థులతో కలిసి పాల్గొన్న సంఘం నాయకులు, ఉపాధ్యాయులు

ఎల్లారెడ్డి, నవంబర్ 14, (మహాప్రభ)



ఎల్లారెడ్డిలోని తెలంగాణ మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో అంబేద్కర్ యువజన సంఘం సభ్యుల ఆధ్వర్యంలో బాలల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సంఘం నాయకులు, ఉపాధ్యాయులు కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో అంబేద్కర్ యువజన సంఘం కోశాధికారి కర్రోళ్ల మొగులయ్య, కనిరాం, డివిజన్ అధ్యక్షుడు మర్ల సాయిబాబా, జిల్లా బీసీ సంఘం అధ్యక్షుడు లింగమయ్య, ఎల్లారెడ్డి బీసీ సంఘం ఇన్‌చార్జి అజయ్ పాల్గొన్నారు.అలాగే పాఠశాల ఉపాధ్యాయులు బాలరాజ్, గంగాధర్, విద్యార్థులు హాజరై వేడుకలను విజయవంతం చేశారు.

అది ముమ్మాటికీ రేవంత్ రక్షణ సేన

(మొదటి తరువాయి)

మాజీ చైర్మన్లు పల్లె రవికుమార్, రామచంద్రనాయక్, పార్టీ నాయకులు కల్వకుర్తి శ్రీనివాస్‌యాదవ్, రాజుతో కలిసి అయన మీడియాతో మాట్లాడారు. సిద్దిపేటలో కవిత చేసిన నిరాధార ఆరోపణలపై తీవ్రంగా స్పందించారు. కవితను బీఆర్ఎస్ నుంచి బహిష్కరించి దుర్మార్గమైన దోపిడీ, పెనుముప్పు నుంచి తెలంగాణను రక్షించిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. నిజంగా టీఆర్ఎస్ ప్రజల పక్షాన పోరాడేందుకు ఏర్పాటుచేసిన పార్టీ అయితే, అధికార కాంగ్రెస్ దోపిడీని నిలదీయకుండా.. ప్రతిపక్ష బీఆర్ఎస్‌పైనే ఎందుకు దాడిచేస్తుంది? అని సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్‌రెడ్డి, కవిత కలిసే బీఆర్ఎస్‌పై కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. అధికార కాంగ్రెస్‌ను వదిలి నిత్యం తన తండ్రి కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుపై విమర్శలు చేయడంలోని ఔచిత్యమేంది? కన్నతండ్రిని మరమనిషి అని దూషించడంలోని మర్మమేంది? అని నిలదీశారు. బీఆర్ఎస్ నేతలపై నిత్యం గళమెత్తుతున్న టీఆర్ఎస్..కాంగ్రెస్‌కు అనుబంధ సంస్థ కాకుంటే మరేంది? అని ప్రశ్నించారు. ఎన్ని కేసులు పెట్టినా, వేధింపులకు దిగినా అధికార పార్టీ దోపిడీపై ప్రతిపక్ష బీఆర్ఎస్ పోరాడుతుంటే.. కవిత పార్టీ అధికార పార్టీకే వంతపాడుతున్నదని మండిపడ్డారు. తెలంగాణ ప్రజలకు ఎవరేందో స్పష్టంగా తెలుసని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

ఒకే కంపెనీలో ఆ ముగ్గురూ భాగస్వాములు

ఆడికోర్ ఇన్‌ఫ్రా కంపెనీలో 2012లో రేవంత్‌రెడ్డి, 2010లో కవిత డైరెక్టర్లు కాగా, సూదిని సృజన్‌రెడ్డి (రేవంత్‌రెడ్డి బావమరిది) కో డైరెక్టర్‌గా ఉన్నారని ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సంచలన విషయాలు వెల్లడించారు. ఇది కల్పితం కాదని, పచ్చి నిజమని స్పష్టంచేశారు. రేవంత్‌రెడ్డి, కవిత, సృజన్‌రెడ్డి కలిసి వ్యాపారాలు చేశారని, ఒకే చిరునామాతో 30 కంపెనీలు ఏర్పాటు చేశారని ఆరోపించారు. మల్లన్నసాగర్ భూకంపం జోన్‌లో నిర్మించారని కవిత చేసిన ఆరోపణలను ఆర్ఎస్పీ కొట్టిపారేశారు. 'కేంద్ర జలసంఘం, జీఎస్ఐ నుంచి అనుమతులు వచ్చిన తర్వాతే 50 టీఎంసీల రిజర్వాయర్ నిర్మించారు. కేసీఆర్ ఆదేశాలు, హరీశ్‌రావు పర్యవేక్షణలో ఇంజినీర్లు నిర్ణయం తీసుకున్నారు' అని గుర్తుచేశారు. 'కవిత చదివింది కంప్యూటర్ ఇంజినీరింగ్.. ఆమె జియాలజీ ఎక్స్‌పర్ట్ కాదు.. సివిల్ ఇంజినీర్ అంతకన్నా కాదు..' అని స్పష్టంచేశారు.

విజిలెన్స్ రిపోర్ట్ కవిత చేతికెలా వచ్చింది?

మల్లన్నసాగర్ నిర్మించిన ఇంజినీర్లపై రూపొందించిన విజిలెన్స్ రిపోర్ట్ ఆధారంగా ఇటీవల సిద్దిపేటలో కవిత మాట్లాడిన విషయాలను ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ప్రస్తావించారు. విజిలెన్స్ విభాగం తన నివేదికలను సీఎంకు పంపుతుందని, మరి ఆ రహస్య నివేదికలు కవిత చేతికి ఎలా వచ్చాయి? అని ప్రశ్నించారు. అంటే ఆమెకు సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చినట్టే కదా.. అది అధికార రహస్యాల ఉల్లంఘన కింద నేరం కాదా? అని నిలదీశారు. విజిలెన్స్ విభాగం వద్ద ఉండాల్సిన నివేదికలు కవిత వద్దకు ఎలా వెళ్తాయి? అని ప్రశ్నించారు.

అండర్-19 ఆసియా కప్ విజేతగా భారత్.

పాకిస్థాన్‌పై ఒక్క వికెట్ తేడాతో గెలిచిన భారత్

రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి అండర్-19 ఆసియా కప్ కైవసం

యువ జట్టు అద్భుత ప్రదర్శనపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసలు

ఆఖరి బంతికి బౌండరీ బాది జట్టును గెలిపించిన మోహిత్ ఉల్వా

ఆకట్టుకున్న కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ, ఆర్యవీర్ సెహ్వాగ్

యువ జట్టుకు ప్రధాని మోదీ ప్రశంసలు



మస్కట్ వేదికగా జరిగిన పురుషుల అండర్-19 ఆసియా కప్ 2026 ఫైనల్ పోరులో భారత యువ జట్టు అద్భుత విజయాన్ని అందుకుంది. దాయాది పాకిస్థాన్‌తో చివరి బంతి వరకు అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో టీమిండియా ఒక వికెట్ తేడాతో చిరస్మరణీయ విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. రికార్డు స్థాయిలో తొమ్మిదోసారి ఈ ట్రోఫీని ముద్దాడిన యువ జట్టుపై ప్రధాని నరేంద్ర మోదీ ప్రశంసల వర్షం కురిపించారు. భారత జట్టు సాధించిన ఈ చారిత్రక విజయంపై ప్రధాని మోదీ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. "భారత క్రికెట్‌కు ఇది ఎంతో గొప్ప రోజు. నేటి మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన కనబరిచి మెన్స్ అండర్-19 ఆసియా కప్ 2026 గెలిచిన మన యువ క్రికెటర్లను చూసి ఎంతో గర్వపడుతున్నాను. వీరి విజయం ఎంతోమంది యువతకు స్ఫూర్తినిస్తుంది. భవిష్యత్తులో ఈ జట్టు మరిన్ని విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను" అని ప్రధాని తన పోస్టులో పేర్కొన్నారు. అల్ అమెరత్ క్రికెట్ గ్రౌండ్‌లో శనివారం జరిగిన ఈ హై-వోల్టేజ్ ఫైనల్ మ్యాచ్‌లో టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ చేసిన పాకిస్థాన్ నిర్ణీత 50 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 337 పరుగుల భారీ స్కోరు సాధించింది. పాక్ బ్యాటర్లలో ఉస్మాన్ ఖాన్ 107 పరుగులతో సెంచరీ సాధించగా, అబ్దుల్ ఖాదిర్ 80, కెప్టెన్ ఫర్హాన్ యూసుఫ్ 63 పరుగులతో రాణించారు. భారత బౌలర్లలో కావ్య పటేల్ నాలుగు వికెట్లతో సత్తా చాటగా, చిగురుపాటి వెంకట మూడు వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేశారు. అనంతరం 338 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన భారత్.. 50 ఓవర్లలో 9 వికెట్లు కోల్పోయి 339 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. భారత కెప్టెన్ లక్ష్య రాయ్‌చందానీ 101 బంతుల్లో 80 పరుగులు చేసి బాధ్యతాయుత ఇన్నింగ్స్ ఆడగా, ఆర్యవీర్ సెహ్వాగ్ 61 బంతుల్లో 58 పరుగులు చేసి మంచి ఆరంభాన్ని ఇచ్చారు. అయితే, మధ్యలో స్వల్ప వ్యవధిలోనే వికెట్లు కోల్పోయిన భారత్ 254 పరుగులకే 8 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో పడింది. ఈ దశలో మనల్ చౌహాన్, మోహిత్ ఉల్వా అద్భుత పోరాటపటిమ కనబరిచారు. వీరిద్దరూ కలిసి 9వ వికెట్‌కు 57 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని నెలకొల్పి మ్యాచ్‌ను తిరిగి భారత్ వైపు తిప్పారు. చౌహాన్ 32 బంతుల్లో 47 పరుగులు చేసి అవుటైనా, ఉల్వా క్రీజులో పాతుకుపోయి ఒత్తిడిని సమర్థంగా ఎదుర్కొన్నాడు. చివరి ఓవర్లో భారత్ విజయానికి 8 పరుగులు అవసరం కాగా.. మోహిత్ ఉల్వా, చిగురుపాటి వెంకట నిలకడగా ఆడి సమీకరణాన్ని చివరి బంతికి 3 పరుగులుగా మార్చారు. ఆఖరి బంతికి అహ్మద్ హుస్సేన్ వేసిన డెలివరీని మోహిత్ ఉల్వా బౌండరీకి తరలించి భారత్‌కు చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. ఉల్వా 49 పరుగులతో అజేయంగా నిలిచి జట్టును గెలిపించాడు. దీంతో డిఫెండింగ్ ఛాంపియన్‌గా బరిలోకి దిగిన పాకిస్థాన్‌కు నిరాశ ఎదురవ్వగా, భారత్ తొమ్మిదోసారి ఆసియా కప్ ట్రోఫీని కైవసం చేసుకుంది.

2014లోనే భారత ప్రజాస్వామ్య ధ్వంసం

-దేశంలో 14 కోట్ల మంది ఓటర్లు ఉనికిలో లేరా?

-మహారాష్ట్రలో 3 నెలల్లో 70 లక్షల మంది కొత్త ఓటర్లు ఎలా వచ్చారు?

-2024 లోక్‌సభ ఎన్నికలకు విశ్వసనీయత లేదు

-భారత్ సమ్మిట్‌లో రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు

-ప్రజాస్వామ్య పరిరక్షణ ప్రపంచ దేశాల బాధ్యతని ప్రకటన



హైదరాబాద్,

భారత ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, 2014లోనే దేశంలో ప్రజాస్వామ్య వ్యవస్థ ధ్వంసమైందని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ప్రజాస్వామ్య పరిరక్షణ కేవలం భారత్‌కు సంబంధించిన అంశం కాదని, ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య ఉద్యమానికి భారత్ కీలకమని పేర్కొన్నారు. గత దశాబ్ద కాలంగా ఫాసిస్టు శక్తులు వ్యవస్థలను బలహీనపరుస్తూ గందరగోళం సృష్టిస్తున్నాయని విమర్శించారు. హైదరాబాద్‌లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన భారత్ సమ్మిట్ ముగింపు కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా కేంద్రంలోని మోదీ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. 2024 లోక్‌సభ ఎన్నికల విశ్వసనీయతతో పాటు మహారాష్ట్ర ఎన్నికల్లో ఓటర్ల సంఖ్యలో వచ్చిన మార్పులపై ప్రశ్నలు లేవనెత్తారు. భారత్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు రావాల్సిన కొందరు విదేశీ ప్రతినిధులకు వీసాలు మంజూరు కాకపోవడంపై రాహుల్ గాంధీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ పరిణామం పట్ల విదేశీ ప్రతినిధులు క్షమాపణలు చెప్పాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఇది తమ తప్పు కాదని వారు చెప్పినట్లు వెల్లడించారు. దేశంలో ప్రస్తుతం నెలకొన్న పరిస్థితులకు ఈ ఘటన అద్దం పడుతోందని వ్యాఖ్యానించారు. తమకే అన్నీ తెలుసునని భావించే వారు ఇతరుల అభిప్రాయాలను గౌరవించడం లేదని విమర్శించారు. వ్యవస్థలు సక్రమంగా పనిచేస్తున్నప్పుడు ఫాసిస్టు శక్తులు తెరవెనుక ఉంటాయని, అవి బలహీనపడినప్పుడు ఒక్కసారిగా బయటకు వచ్చి గందరగోళం సృష్టిస్తాయని రాహుల్ గాంధీ అన్నారు. గత దశాబ్ద కాలంగా ఇలాంటి శక్తులు దేశంలో వేళ్లూనుకుంటున్నాయని విమర్శించారు. 2014 ఎన్నికల సమయంలో దేశంలో ఎన్నడూ చూడని విధంగా భిన్నమైన రాజకీయ వాతావరణం కనిపించిందని గుర్తుచేశారు. రాజకీయ వ్యవస్థలోకి భారీగా డబ్బు ప్రవేశించిందని, ప్రచార సరళి, హంగులు, ఆర్భాటాలు గతంలో ఎన్నడూ లేని స్థాయికి చేరాయని అన్నారు. ఈ పరిణామాలతో ప్రతిపక్ష పార్టీలు సైతం తొలుత దిగ్భ్రాంతికి గురయ్యాయని పేర్కొన్నారు. అప్పట్లో పరిస్థితుల తీవ్రతను పూర్తిగా అర్థం చేసుకోలేకపోయామని, క్రమంగా పరిణామాలను విశ్లేషించి వాస్తవాలను గుర్తించామని వివరించారు. 2024 లోక్‌సభ ఎన్నికల ఫలితాల విశ్వసనీయతపై రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు లేవనెత్తారు. ఎన్నికల్లో ఓటు వేసిన 14 కోట్ల మంది ప్రజలు కొన్ని నెలల తర్వాత ఓటర్ల జాబితాలో ఉనికిలో లేనివారిగా గుర్తించబడుతున్నారా? అని ప్రశ్నించారు. ప్రతిపక్ష పార్టీలపై కేసులు, ఇతర ఒత్తిళ్లు పెరుగుతున్నప్పటికీ ప్రజలతో ప్రత్యక్ష సంబంధాన్ని కొనసాగిస్తూ రాజకీయ పోరాటాన్ని ముందుకు తీసుకెళ్తున్నామని చెప్పారు. మహారాష్ట్ర ఎన్నికలను ప్రస్తావిస్తూ ఓటర్ల జాబితాలో వచ్చిన మార్పులపై అనుమానాలు వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల్లో తమ కూటమి విజయం సాధించగా, కేవలం మూడు నెలల తర్వాత జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి ఎదురైందని గుర్తుచేశారు. రెండు ఎన్నికల్లోనూ తమ కూటమికి వచ్చిన ఓట్ల సంఖ్య దాదాపు ఒకేలా ఉన్నప్పటికీ, ఈ మూడు నెలల వ్యవధిలో 70 లక్షల మంది కొత్త ఓటర్లు ఎలా చేరారని ప్రశ్నించారు. వారంతా ఒకే పార్టీకి ఓట్లు వేసినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. ఇలాంటి పరిణామాలు మహారాష్ట్రకే పరిమితం కాలేదని, దేశంలోని ఇతర రాష్ట్రాల్లోనూ చోటుచేసుకున్నాయని పేర్కొన్నారు. ప్రజలతో మమేకమవడం, వారి సమస్యలను అర్థం చేసుకోవడమే తమ ప్రధాన మార్గమని రాహుల్ గాంధీ తెలిపారు. అంతర్జాతీయ నాయకులను ఉద్దేశించి మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఈ పోరాటం ప్రజాస్వామ్య పద్ధతుల్లోనే ఉంటుందని, ప్రేమ, ఆప్యాయతతో ముందుకు సాగుతామని, కోపం, ద్వేషానికి తావివ్వబోమని పేర్కొన్నారు. భారత ప్రజాస్వామ్యం పరిమాణం, వైవిధ్యం, సంక్లిష్టత దృష్ట్యా ప్రపంచానికి ఒక ప్రజా సంపదతో సమానమని అభివర్ణించారు. భారత్‌లో ప్రజాస్వామ్యం బలహీనపడితే ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం సాగుతున్న ఉద్యమాలపైనా ప్రభావం పడుతుందని అన్నారు. భారత ప్రజాస్వామ్యాన్ని కాపాడటం అంతర్జాతీయ సమాజానికి కూడా ముఖ్యమైన బాధ్యత అని పేర్కొన్నారు.

హసీనా భద్రతకు హామీ ఇస్తేనే..!



న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనా స్వదేశానికి తిరిగి వెళ్లే అంశంపై భారత్ కీలక ప్రతిపాదనలు చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఆమె భద్రతకు, న్యాయపరమైన హక్కులకు హామీ లభించిన తర్వాతే బంగ్లాదేశ్‌కు పంపించే ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని భారత్ భావిస్తున్నట్లు సమాచారం. ఇందుకోసం ప్రధానంగా రెండు షరతులను బంగ్లాదేశ్ ప్రభుత్వం ముందుంచినట్లు కథనాలు పేర్కొన్నాయి. హసీనా తిరుగు ప్రయాణాన్ని బంగ్లాదేశ్ సైన్యం పర్యవేక్షించాలని భారత్ కోరుతున్నట్లు తెలుస్తోంది. 2024 ఆగస్టు 5న బంగ్లాదేశ్‌లో రాజకీయ సంక్షోభం తలెత్తడంతో ఆమె అక్కడి నుంచి సైనిక విమానంలో భారత్‌కు చేరుకున్నారు. ఇప్పుడు తిరిగి వెళ్లే సమయంలోనూ బంగ్లాదేశ్ సైన్యమే బాధ్యత తీసుకోవాలని భారత్ భావిస్తున్నట్లు మీడియా కథనం వివరించింది. ఇందుకోసం రెండు మార్గాలను పరిశీలిస్తున్నట్లు సమాచారం. బంగ్లాదేశ్ ప్రభుత్వం ఢిల్లీకి సైనిక విమానాన్ని పంపించి ఆమెను తీసుకెళ్లడం లేదా భారత్-బంగ్లాదేశ్ సరిహద్దులో నిర్దేశిత ప్రాంతంలో ఆ దేశ సైన్యం ఆమెను స్వీకరించడం వంటి ప్రతిపాదనలు ఉన్నట్లు కథనం పేర్కొంది. భారత్ ముందుంచినట్లు చెబుతున్న రెండో షరతు న్యాయపరమైన అంశానికి సంబంధించినది. 2024 జులై ఉద్యమ సమయంలో జరిగిన హింసకు సంబంధించి హసీనాపై చేపట్టే విచారణ నిష్పక్షపాతంగా జరగాలని భారత్ కోరుతున్నట్లు సమాచారం. ఆమెకు న్యాయపరమైన హక్కులు కల్పించాలని, మరణశిక్ష విధించిన పక్షంలో దానిపై అప్పీల్ చేసుకునే అవకాశం ఉండాలని ప్రతిపాదించినట్లు తెలుస్తోంది. అంతర్జాతీయ సమాజం, ప్రపంచ మీడియా పర్యవేక్షణలో న్యాయప్రక్రియ కొనసాగితేనే ఆమెకు న్యాయం జరుగుతుందనే అభిప్రాయాన్ని భారత అధికారులు వ్యక్తం చేసినట్లు అంతర్జాతీయ మీడియా కథనం వెల్లడించింది.

నింగిలోకి స్టార్‌షిప్.. సముద్రంలో పేలిన బూస్టర్!

టెక్సాస్



ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన స్టార్‌షిప్ రాకెట్‌ను స్పేస్‌ఎక్స్ విజయవంతంగా నింగిలోకి పంపినప్పటికీ.. తిరిగి భూమిపైకి తీసుకొచ్చే ప్రయత్నంలో దాని బూస్టర్ పేలిపోయింది. శుక్రవారం టెక్సాస్‌లోని సౌత్ టెక్సాస్ స్టార్‌బేస్ నుంచి ఈ ప్రయోగాన్ని చేపట్టారు.రాకెట్‌లోని రెండు దశలు విజయవంతంగా పైకి దూసుకెళ్లాయి. అయితే బూస్టర్‌ను తిరిగి రప్పిస్తున్నప్పుడు అది నిర్ణీత మార్గం నుంచి పక్కకు మళ్లి గల్ఫ్ ఆఫ్ మెక్సికో మీదుగా ప్రయాణిస్తూ సముద్రంపై పేలిపోయింది.

పాలస్తీనాకు భారత్ సహా 151 దేశాల మద్దతు

- ఐరాస జనరల్ అసెంబ్లీలో కీలక తీర్మానానికి ఆమోదం
- పాలస్తీనా ప్రజల హక్కులకు భారత్ మద్దతు
- ఆక్రమిత సిరియాలోని గోలాన్ అరబ్ ప్రజలకూ అండ
- సహజ వనరులపై శాశ్వత హక్కులను ధ్రువీకరించిన తీర్మానం
- భారత్‌తో పాటు మొత్తం 151 దేశాల అనుకూల ఓటు



జెనీవా: పాలస్తీనా ప్రజలకు మద్దతుగా ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కీలక ముసాయిదా తీర్మానానికి భారత్ అనుకూలంగా ఓటు వేసింది. పాలస్తీనా ప్రజలతో పాటు ఆక్రమిత సిరియాలోని గోలాన్ ప్రాంతంలో నివసిస్తున్న అరబ్ ప్రజలకు తమ సహజ వనరులపై శాశ్వత సార్వభౌమ హక్కులు ఉండాలని ఈ తీర్మానం స్పష్టం చేసింది. జనరల్ అసెంబ్లీ 81వ సమావేశంలోని రెండో కమిటీలో ఈ తీర్మానం ఆమోదం పొందింది. భారత్‌తో పాటు మొత్తం 151 దేశాలు దీనికి మద్దతుగా ఓటు వేశాయి. సహజ వనరులపై ఆయా ప్రాంతాల ప్రజల హక్కులను మరోసారి ధ్రువీకరించడం ఈ తీర్మానంలోని ప్రధాన అంశంగా నిలిచింది.

ఇప్పుడు చేయాల్సింది పోరాటమే

(మొదటి తరువాయి)

ఈ పోరాటంలో కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ దేశానికి నాయకత్వం వహిస్తున్నారని, ఆయనకు అందరూ మద్దతుగా నిలవాలని కోరారు. శనివారం హైదరాబాద్‌లో నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో సీఎం మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాలకు చెందిన ప్రతినిధులు, మేధావులు, ప్రభావశీల వ్యక్తులను ఒకే వేదికపైకి తీసుకురావడమే సమ్మిట్ ప్రధాన ఉద్దేశమని రేవంత్‌రెడ్డి తెలిపారు. 70 దేశాల నుంచి వెయ్యి మందికి పైగా ప్రతినిధులను ఆహ్వానించామని, అయితే వారిలో చాలామందికి కేంద్ర ప్రభుత్వం వీసాలు నిరాకరించిందని ఆరోపించారు. అయినప్పటికీ ప్రపంచవ్యాప్తంగా ప్రజలు ఈ పరిణామాలను గమనిస్తున్నారని పేర్కొన్నారు. తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ జయంతి రోజున సమ్మిట్ నిర్వహించడం ప్రత్యేకమని, రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి నెహ్రూ దార్శనికత దోహదపడిందని గుర్తుచేశారు. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడిన శక్తులకు, రాజ్యాంగ వ్యవస్థను బలహీనపరిచే శక్తులకు మధ్య పోరాటం సాగుతోందని సీఎం అన్నారు. తాము రాజ్యాంగం, చట్టబద్ధ పాలనకు కట్టుబడి ఉన్నామని, ప్రతి పౌరుడికీ ఓటు హక్కు ఉండాలని కోరుకుంటున్నామని చెప్పారు. మరోవైపు రాజ్యాంగాన్ని బలహీనపరిచి, తమకు అనుకూలమైన వర్గాలకే ఓటు హక్కు కల్పించాలని కొందరు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. పర్యావరణ పరిరక్షణ, పేదలు, మహిళలు, మైనారిటీలు, రైతుల సంక్షేమం తమ ప్రభుత్వ ప్రాధాన్యాలని రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. సంపన్నుల ప్రయోజనాలకే ప్రాధాన్యమిస్తూ, కొద్దిమంది చేతుల్లో అధికారాన్ని కేంద్రీకరించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. అందరికీ సమాన అవకాశాలు కల్పించాలని, ప్రభుత్వాలు సంప్రదింపుల ద్వారా నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. ఒకే వ్యక్తి నుంచి ఆదేశాలు వెలువడే వ్యవస్థ ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని వ్యాఖ్యానించారు. ప్రపంచీకరణ, కొవిడ్ అనంతర పరిణామాలతో ప్రపంచ దేశాలన్నీ దాదాపు ఒకే తరహా సమస్యలను ఎదుర్కొంటున్నాయని తెలిపారు. ప్రాథమిక హక్కులపై దాడులు, విద్య, ఉపాధి, వైద్య సేవలు, ద్రవ్యోల్బణం వంటి సమస్యలు ప్రజలను వేధిస్తున్నాయని పేర్కొన్నారు.

మోదీ ఫోన్లు ట్యాప్ చేయరు..

న్యూఢిల్లీ:

కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలపై గాంధీ కుటుంబానికి సన్నిహితుడు, ఇండియన్ ఓవర్సీస్ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు శామ్ పిట్రోడా భిన్నంగా స్పందించారు. ప్రధాని నరేంద్ర మోదీ తన ఫోన్‌ను ట్యాప్ చేస్తారని తాను భావించడం లేదని స్పష్టం చేశారు. తన ఫోన్ నిఘాలో ఉందని నమ్మడానికి ఎలాంటి కారణం కనిపించడం లేదని పేర్కొన్నారు. దేశంలో పరిష్కరించాల్సిన పెద్ద సమస్యలు ఎన్నో ఉన్నాయని, ప్రధాని ఇలాంటి చర్యలకు పాల్పడతారని అనుకోవడం లేదని ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. కాగా, కేంద్ర ప్రభుత్వం తన ఫోన్‌ను ట్యాప్ చేస్తోందని రాహుల్ గాంధీ ఇటీవల ఆరోపించారు. ఈ అంశంపై ముఖాముఖి చర్చకు వస్తే వాస్తవాలు బయటపడతాయని వ్యాఖ్యానించారు.

మైక్రోసాఫ్ట్ సేవలు పునరుద్ధరణ



షికాగో, నవంబర్ 14

ప్రపంచవ్యాప్తంగా 74 దేశాల్లో రెండు రోజుల పాటు అంతరాయానికి గురైన మైక్రోసాఫ్ట్ సేవలు తిరిగి అందుబాటులోకి వచ్చాయి. ఔట్‌లుక్, మైక్రోసాఫ్ట్ టీమ్స్, మైక్రోసాఫ్ట్ 365తో పాటు ఇతర క్లౌడ్ సేవలను పూర్తిగా పునరుద్ధరించినట్లు సంస్థ ప్రకటించింది. సమస్యకు కారణమైన సాంకేతిక లోపాన్ని పరిష్కరించామని, ప్రభావిత వినియోగదారులకు సేవలను తిరిగి అందుబాటులోకి తెచ్చామని ఎక్స్ వేదికగా వెల్లడించింది. ఈ అంతరాయం భారత్‌తో పాటు పలు దేశాలపై ప్రభావం చూపింది. ముఖ్యంగా ఆరోగ్య సేవలు, బ్యాంకింగ్, వ్యాపార సంస్థలు, విమానయాన కార్యకలాపాలకు ఆటంకం ఏర్పడింది. భారత్‌లో కార్పొరేట్ రంగంతో పాటు విమానయాన సేవలపైనా ప్రభావం పడింది. ఇండిగో పలు విమాన సర్వీసులను నిలిపివేయాల్సి వచ్చింది. జపాన్, సింగపూర్, ఆస్ట్రేలియా ప్రభుత్వాలు తమ కార్యకలాపాల్లో కొన్ని గంటలపాటు అంతరాయం ఏర్పడినట్లు వెల్లడించాయి. గ్రీన్, బ్రిటన్, నార్వేలోనూ కొన్ని ప్రభుత్వ కార్యకలాపాలు ప్రభావితమయ్యాయి. అమెరికాలో గురువారం మధ్యాహ్నం ఈ సమస్యలు మొదలయ్యాయి. గంట వ్యవధిలోనే 74 దేశాలు, ప్రాంతాల నుంచి అంతరాయానికి సంబంధించిన ఫిర్యాదులు అందాయి. అయితే ఇది సైబర్ దాడి లేదా కృత్రిమ మేధ వ్యవస్థలకు సంబంధించిన సమస్య కాదని మైక్రోసాఫ్ట్ స్పష్టం చేసింది. ఇటీవల నెట్‌వర్క్‌లో చేసిన మార్పులు, సామర్థ్య విస్తరణ సమయంలో ఏర్పడిన సాంకేతిక లోపమే అంతరాయానికి కారణమని వివరించింది. ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది ఆధారపడుతున్న క్లౌడ్ సేవల్లో ఏర్పడిన ఈ సమస్య డిజిటల్ వ్యవస్థలపై ఆధారపడటం ఎంత విస్తృతంగా ఉందో మరోసారి వెల్లడించింది.

హామీలు ఘనం.. అమలు జీరో

42 శాతం వాటా కల్పిస్తామన్న హామీని అమలు చేయలేదన్నారు. పేద ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు రూ.12 లక్షల అంబేద్కర్ అభయ హస్తం పథకం, ప్రభుత్వ కాంట్రాక్టుల్లో వారికి 31 శాతం వాటా కల్పిస్తామన్న హామీలు కూడా అమలుకు నోచుకోలేదని విమర్శించారు. 365 రోజుల్లో రెండు లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు కేవలం 10 వేల ఉద్యోగాలే ఇచ్చారని, రాజీవ్ యువ వికాసం పథకం అమలు కాలేదని పేర్కొన్నారు. విద్యార్థులకు రూ.5 లక్షల విద్యా భరోసా కార్డు, మైనారిటీలకు రూ.4 వేల కోట్ల బడ్జెట్ హామీలను కూడా ప్రభుత్వం విస్మరించిందన్నారు. మైనారిటీలకు కేటాయింపులు రూ.వెయ్యి కోట్లలోపే ఉన్నాయని ఆరోపించారు. తెలంగాణకు కాంగ్రెస్ చేస్తున్న ద్రోహానికి అంతులేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.



ఇంటర్ రద్దు..ఎన్నో ప్రశ్నలు!



రాష్ట్ర ప్రభుత్వం వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇంటర్ విద్యకు సెలవు ప్రకటిస్తున్నది. 1969 నుంచి కొనసాగుతున్న విధానానికి ఇక తెరపడనున్నది. ఇక నుంచి పాఠశాల విద్యలో భాగంగా 11,12 తరగతులు నిర్వహించనున్నారు. ఇదంతా విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకొని, ఆధునిక అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే లక్ష్యంతో జరుగుతున్నదని ప్రభుత్వం చెప్తున్నది. మూడేండ్లుగా విద్యా రంగంలో సీఎం ప్రకటనలు ఘనంగా, ఆచరణ శూన్యంగా ఉంటున్నాయి. అధికారంలోకి రాగానే స్కిల్ యూనివర్సిటీ, యంగ్ ఇండియా రెసిడెన్షియల్ ఇంటర్నేషనల్ స్కూల్స్, స్పోర్ట్స్ యూనివర్సిటీ, ప్రభుత్వ పాఠశాలల్లో పూర్వ ప్రాథమిక విద్య వంటి చర్యలను ప్రకటించారు. 26 వేల ప్రభుత్వ పాఠశాలలను 4 వేల తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌గా కుదించడం కూడా ప్రకటనల జాబితాలో ఉన్నది.

ప్రభుత్వం విద్యారంగంలో పలు ప్రకటనల తర్వాత ఆకునూరి మురళి చైర్మన్‌గా తెలంగాణ విద్యాకమిషన్ నియామకం జరిగింది. ఆ తర్వాత ప్రభుత్వం కేశవరావు కమిటీని ప్రకటించింది. రెండు కమిటీల నివేదికల సిఫార్సులు ఏమయ్యాయో అనే చర్చ జరుగలేదు. ఆ వెంటనే ఇంటర్ విద్య రద్దు ప్రకటన వచ్చింది. నిరుడు విద్యా సంవత్సరం చివరలో ఇంటర్ రద్దు విషయం ప్రకటించినప్పటికీ సాంకేతిక అంశాల ఆటంకాలతో ప్రస్తుత విద్యా సంవత్సరంలో అమలు కాలేదు. ఇక వచ్చే సంవత్సరం ఇంటర్ విద్య రద్దు కానున్నది. ఆ తర్వాత పాఠశాల విద్యలో జరగనున్న మార్పులు ఏమిటి ? ఆ మార్పులన్నీ ప్రభుత్వ పాఠశాలల్లోనేనా? లేక 65 శాతం మంది విద్యార్థులు చదివే ప్రైవేట్ పాఠశాలల్లో కూడా ఇదే విధానం అమలవుతుందా అనే విషయంలో స్పష్టతలేదు. ప్రభుత్వ రంగంలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలలకు అదనంగా, రెసిడెన్షియల్ పద్ధతిలో ఆరు రకాల గురుకుల పాఠశాలలు, ఆదర్శ పాఠశాలలు (మాడల్ స్కూల్స్), బాలికలకు ప్రత్యేకంగా కేజీబీవీ పాఠశాలలు, గిరిజన సంక్షేమశాఖ నిర్వహణలో గిరిజన పాఠశాలలు ఉన్నాయి. ఈ పాఠశాలల్లో కొన్నింటిలో ఇప్పటికే ఇంటర్ తరగతులు ప్రారంభమయ్యాయి. ఇంటర్ రద్దయితే ఆయా పాఠశాలల్లో 11, 12 తరగతుల కోసం అదనంగా తరగతి గదులు, ప్రయోగశాలలు, వసతులు కల్పించాల్సి ఉంటుంది. అన్ని పాఠశాలల్లో ఇంటర్ తరగతులు ప్రారంభిస్తే జూనియర్ కళాశాలలోని అధ్యాపకులను ఏ పాఠశాలలకు కేటాయిస్తారు? అక్కడ బోధన సిబ్బందిని ఎలా సర్దుతారు? ప్రతి పాఠశాలలోనూ ఇంటర్ తరగతులు ప్రారంభిస్తే అన్ని గ్రూపులు ప్రారంభిస్తారా? అదనంగా అవసరమయ్యే బోధన సిబ్బందిని ఎలా సమకూరుస్తారు? ఇవన్నీ ప్రశ్నలుగా మిగులుతున్నాయి. ఇంటర్ విద్య రద్దు ప్రకటనతో యావత్తు విద్యాశాఖ అచేతనంగా మారకుండా జాగ్రత్తపడాలి. కానీ మూడేండ్ల అనుభవం చూస్తే ప్రకటనలు ఘనం, ఆచరణ శూన్యంగానే ఉన్నది. ఈ మార్పులకు నిధుల లభ్యత ఎలా ఉండబోతున్నది? మాడల్ స్కూళ్లను తెలంగాణ పబ్లిక్ స్కూళ్లుగా మార్చడానికి రూ.787 కోట్ల రుణం ఆర్థిక సంస్థల నుంచి, రాష్ట్ర ప్రభుత్వ వాటాగా సీఎస్ఆర్ నిధులను కేటాయించి అభివృద్ధి చేస్తామని ప్రభుత్వం చెప్తున్నది. ఈ నిధుల్లో రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్ నుంచి రూపాయి కూడా లేకపోవడం ప్రభుత్వానికి విద్యారంగంపై చెప్పే మాటలకు, చేతలకు మధ్య తేడాను స్పష్టం చేస్తున్నది. విద్యారంగం అభివృద్ధి విషయంలో నిధుల కోసం ఆర్థిక సంస్థలు ఇచ్చే అప్పులపై ఆధారపడటమేనా? ఆ క్రమంలోనే యంగ్ ఇండియా ఇంటర్నేషనల్ స్కూళ్ల నిర్మాణాలు ముందుకు వస్తున్నాయి. ఇలాంటి అనేక రకాల పాఠశాలల్లో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మండల పరిషత్, గిరిజన పాఠశాలలను ఏ రకంగా మార్చబోతున్నారు? సర్కారీ బడుల్లో చేరేందుకు విద్యార్థులు ఆసక్తి చూపడం లేదు. ఈ సందర్భంలో ప్రభుత్వ తాజా చర్యలు తల్లిదండ్రుల ఆదరణను ఎలా పొందబోతున్నాయి? ఈ విధానాలు ఇలా ఉండగా ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల్లో ప్రమాణాలు పడిపోతున్నాయని వివిధ సర్వేలు చెప్తున్నాయి. అయినప్పటికీ ప్రమాణాలు పెంచడానికి ప్రభుత్వ ఆచరణాత్మక చర్యలు శూన్యం. డిప్యూటీ విద్యాధికారులు, మండల స్థాయిలో మండల విద్యాధికారి పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోకుండా విద్యారంగ ప్రమాణాలు పెరుగవనే సంగతి ముఖ్యమంత్రి దృష్టిలో ఉన్నదా? జూనియర్ కాలేజీలు పాఠశాల విద్యలో విలీనమైతే ఆ కళాశాలల్లోని లెక్చరర్లు, బోధనేతర సిబ్బంది ఉద్యోగ, రిటైర్‌మెంట్ బెనిఫిట్లకు ఎటువంటి ఇబ్బంది లేకుండా చూస్తామని సీఎం చెప్తున్నారు. ఇప్పటికే రాష్ట్రంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, జిల్లా పరిషత్ ఉపాధ్యాయుల మధ్య సర్వీస్ రూల్స్ న్యాయవివాదాలతో ఎంఈవో, డిప్యూటీ ఈవో, డీఈవో పోస్టుల ఉద్యోగోన్నతులు నిలిచిపోయాయి. ఆ వివాదం పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపడం లేదు. ఫలితంగా పాఠశాలల పర్యవేక్షణ పడకేసింది. ఇప్పుడు కొత్తగా జూనియర్ కాలేజీల అధ్యాపకులు పాఠశాల విద్యలో చేరితే వీరికి సంబంధించిన సర్వీస్ నిబంధనలు ఎలా ఉండబోతాయి? న్యాయవివాదాలు రాకుండా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుంది? కేంద్ర ప్రభుత్వం ముందుకు తెచ్చిన నూతన జాతీయ విద్యావిధానం అంశాలే ప్రతిపాదిత విద్యా విధానంలో ఉండడం గమనిస్తాం. రాష్ట్రాల హక్కులను హరిస్తూ కేంద్రీకరణను పెంచే, ప్రైవేటీకరణకు దోహదం చేసే జాతీయ విద్యా విధానాన్ని రాష్ట్ర ప్రభుత్వం వ్యతిరేకించకుండా దొడ్డిదారిన అమలు చేయడానికి ప్రయత్నించడం శోచనీయం. రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన 15 శాతం నిధులను బడ్జెట్‌లో కేటాయించాలి. నిధుల లభ్యతతో నే పాఠశాలలకు, మౌలిక వసతులు కల్పించడం, ఉపాధ్యాయుల నిరంతర నియామకాల కోసం ఏటా డీఎస్సీని నిర్వహించడం, కొత్త పాఠశాలలను స్థాపించడం వీలవుతుంది. ప్రభుత్వ అజమాయిషీలోనే పాఠశాలలను అన్ని రకాల వసతులతో అభివృద్ధి చేసి, ప్రతి సబ్జెక్టుకూ, ప్రతి తరగతి కీ ఒక ఉపాధ్యాయుడిని నియమించాలి. పౌష్టికాహారం తో కూడిన మధ్యాహ్న భోజనాన్ని అంది స్తూ పటిష్టమైన పర్యవేక్షణ కలిగి జవాబుదారీతనం తో కూ డిన, ఉన్నత ప్రమాణాల విద్యను అందించాలి. ఈ మేరకు తల్లిదండ్రులకు గ్యారెంటీ ఇచ్చేలాగా ప్రభుత్వం ఆచరణాత్మక చర్యలు తీసుకోవాలి. ఆధునిక ప్రపంచ అవసరాలకు అనుగుణంగా విద్యావిధానాన్ని రూపొందిస్తామని చెప్తే, మన రా ష్ట్రం అవసరాలు ఏంటి? రాష్ట్రానికి అవసరాలు ఉంటాయా? మన రాష్ట్ర అవసరాలకు అనుగుణంగా విద్యార్థులు తయారు కాకూడదా? విద్య ఎవరి అవసరాలు తీర్చాలి? విద్యా లక్ష్యాలు ఏమి టి? లక్ష్యాలను ముందు నిర్ణయించి, అందుకు అనుగుణంగా విద్యావిధానం రూపొందించాలి. విద్యాసంస్థలను నెలకొల్పాలి. రాష్ట్రంలో లభ్యమయ్యే సహజ వనరులు, ఖనిజ సంపద, జల వనరులను తెలంగాణ సమా జ అభివృద్ధికి ఉపయోగపడేలా చూసే విద్యావిధానాన్ని రూపొందించాలి. అందులో విద్యార్థులను భాగస్వాములుగా చేసి, వారిని ఉత్తమ మానవ వనరులుగా తీర్చిదిద్దాలి. ఇందులో జిల్లాల్లోని వి ద్యాలయాలు ఆయా ప్రాంతాల్లోని వనరులను ఆ ప్రాంత అభివృద్ధికి ఉపయోగించుకునేలా పరిశోధనలు జరిపే విజ్ఞాన కేంద్రాలుగా రూపొందించాలి.

నాడు గురుకుల పాఠశాల మంజూరు.. నేడు తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మార్పు!

-చిట్యాల విద్యారంగంలో మారిన ప్రభుత్వ నిర్ణయం.. గురుకుల హోదా ఏమైంది?

-పేద విద్యార్థులకు దక్కే ప్రయోజనాలపై సందేహాలు.. మార్పు వెనుక కారణాలేంటి? స్పష్టత ఇవ్వాలని గ్రామస్థుల డిమాండ్





పెద్దవంగర నవంబర్ 14 (మహాప్రభ)

మండలంలోని చిట్యాల గ్రామానికి గతంలో మంజూరైన మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల పాఠశాల విషయంలో తాజాగా చోటుచేసుకున్న పరిణామం చర్చనీయాంశంగా మారింది. నాడు గ్రామీణ ప్రాంత పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో మంజూరైన గురుకుల పాఠశాల.. నేడు తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా మారడం పలు ప్రశ్నలకు తావిస్తోంది. అసలు గతంలో మంజూరైన గురుకుల పాఠశాల పరిస్థితి ఏమిటి? దాని స్థానంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడం వెనుక ప్రభుత్వ ఉద్దేశం ఏమిటి? విద్యార్థులకు కలిగే ప్రయోజనాలు ఏమిటి? అన్న అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. నాడు గురుకుల మంజూరుకు సమష్టి కృషి నాటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు గ్రామీణ ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రాధాన్యమిస్తూ తీసుకున్న నిర్ణయాల్లో భాగంగా, అప్పటి రాష్ట్ర మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు సహకారంతో చిట్యాల గ్రామానికి మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల మంజూరైంది. అప్పటి జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ సమన్వయంతో, అప్పటి బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షురాలు, ఎంపీపీ ఈదురు రాజేశ్వరి--ఐలయ్య, గ్రామ సర్పంచ్ రావుల శ్రీనివాస్ రెడ్డి తదితరుల కృషి ఐ ఆర్ఫలితంగా ఈ పాఠశాల మంజూరు కావడం గ్రామ ప్రజల్లో ఆనందాన్ని నింపింది. అయితే, మంజూరైన గురుకుల పాఠశాల ప్రస్తుతం తొర్రూరులోని వాగ్దేవి కళాశాల అద్దె భవనంలో కొనసాగుతున్నట్లు సమాచారం. చిట్యాల గ్రామంలోనే పాఠశాల నిర్వహణకు లేదా ప్రభుత్వ స్థలంలో శాశ్వత భవన నిర్మాణానికి సంబంధించి గతంలో ప్రయత్నాలు జరగడం స్థానికుల ఆశలను మరింత పెంచింది.

గురుకులం నుంచి పబ్లిక్ స్కూల్‌కు.. అసలు కారణమేంటి?

గతంలో ప్రత్యేకంగా గురుకుల పాఠశాల మంజూరైన చిట్యాల గ్రామానికి ఇప్పుడు తెలంగాణ పబ్లిక్ స్కూల్ కేటాయించడం చర్చకు దారితీస్తోంది. గురుకుల పాఠశాల మంజూరుతో గ్రామ ప్రజలు ఆశించిన విద్యా సౌకర్యాలు, వసతి సదుపాయాలు, విద్యార్థుల ప్రవేశ అవకాశాల పరిస్థితి ఏమిటన్నది ఇప్పుడు ప్రధాన ప్రశ్నగా మారింది.

గురుకుల పాఠశాల మంజూరును కొనసాగించలేదా? ఒకవేళ కొనసాగించకపోతే అందుకు కారణాలేమిటి? తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటుతో గతంలో ప్రకటించిన గురుకుల విద్యా ప్రయోజనాలు విద్యార్థులకు అందుతాయా? అన్న ప్రశ్నలకు సంబంధిత అధికారులు సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

పాఠశాల పేరులో మార్పు మాత్రమే జరిగిందా? లేక విద్యా విధానం, నిర్వహణ, ప్రవేశాల ప్రక్రియ, విద్యార్థులకు అందించే సౌకర్యాల్లోనూ మార్పులు ఉంటాయా? అనే అంశాలపై కూడా స్పష్టత ఇవ్వాల్సి ఉంది.

పేరు మారితే సరిపోదు.. విద్యా ప్రమాణాలు పెరగాలి!

ఒక గ్రామానికి విద్యాసంస్థ మంజూరు కావడం అనేది కేవలం రాజకీయ హామీగా మిగిలిపోకూడదు. ఆ ప్రాంతంలోని పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే విధంగా ఆ సంస్థ పనిచేయాలి. గురుకుల పాఠశాల మంజూరైనప్పుడు చిట్యాల ప్రజలు పెట్టుకున్న ఆశలు కూడా అదే. ఇప్పుడు తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు నేపథ్యంలోనూ విద్యార్థులకు మెరుగైన బోధన, నాణ్యమైన మౌలిక వసతులు, తగిన సంఖ్యలో ఉపాధ్యాయులు అందుబాటులో ఉండాలి.ముఖ్యంగా గ్రామీణ విద్యార్థులకు అందుబాటులో ఉండేలా పాఠశాలను స్థానికంగా ఏర్పాటు చేయడంతో పాటు, విద్యార్థుల భవిష్యత్తుకు ఉపయోగపడే అన్ని సదుపాయాలు కల్పించాలి. గతంలో గురుకుల పాఠశాల కోసం ఎదురుచూసిన గ్రామ ప్రజలకు ప్రస్తుత మార్పు నిరాశ కలిగించకుండా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

అధికారుల నుంచి సమాధానం కోరుతున్న ఆరు ప్రశ్నలు

1.చిట్యాల గ్రామానికి గతంలో మంజూరైన మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల మంజూరు ప్రస్తుతం ఏ స్థితిలో ఉంది?

2.గురుకుల పాఠశాల స్థానంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేయడానికి తీసుకున్న నిర్ణయం ఏమిటి? అందుకు గల కారణాలేమిటి?

3.గతంలో మంజూరైన గురుకుల పాఠశాలను చిట్యాల గ్రామంలోనే కొనసాగించే అవకాశం లేదా?

4.తెలంగాణ పబ్లిక్ స్కూల్‌లో విద్యార్థులకు ఎలాంటి విద్యా ప్రమాణాలు, వసతి, ఇతర సౌకర్యాలు కల్పించనున్నారు?

5.పాఠశాల ప్రవేశాల విధానం, ఉపాధ్యాయుల నియామకం, తరగతుల నిర్వహణపై ప్రభుత్వ ప్రణాళిక ఏమిటి?

6.ఈ మార్పు వల్ల గతంలో గురుకుల విద్యపై ఆశలు పెట్టుకున్న పేద, బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు ఎలాంటి ప్రయోజనం కలగనుంది?

ప్రభుత్వాలు మారినా.. విద్యార్థుల భవిష్యత్తు మారొద్దు!

నాడు గురుకుల పాఠశాల మంజూరుతో చిట్యాల గ్రామంలో విద్యాభివృద్ధికి బలమైన పునాది పడుతుందని ప్రజలు ఆశించారు. నేడు తెలంగాణ పబ్లిక్ స్కూల్ రూపంలో మరో విద్యాసంస్థ అందుబాటులోకి వస్తున్న నేపథ్యంలో ఆ ఆశలు మరింత బలపడాలి తప్ప నీరుగారకూడదు. పాఠశాల పేరు మారిందా? విధానం మారిందా? అన్నది పక్కనపెడితే విద్యార్థులకు అందే విద్యా ప్రమాణాలు మాత్రం తగ్గకూడదు.

ప్రభుత్వాలు మారవచ్చు.. పథకాల పేర్లు మారవచ్చు.. కానీ పేద విద్యార్థుల చదువు, వారి భవిష్యత్తు మాత్రం రాజకీయ నిర్ణయాలకు బలికాకూడదు. చిట్యాల గ్రామానికి గతంలో మంజూరైన గురుకుల పాఠశాల విషయంలో వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరించి, తెలంగాణ పబ్లిక్ స్కూల్ ద్వారా విద్యార్థులకు కలిగే ప్రయోజనాలపై విద్యాశాఖ ఉన్నతాధికారులు స్పష్టమైన ప్రకటన చేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.

పాలకుర్తి బిఆర్ఎస్‌లో ముదురుతున్న అంతర్గత పోరు..

-తెరవెనుక వ్యూహాలపై రాజకీయ వర్గాల్లో చర్చ!

-పసునూరి నవీన్ తీరుపై జోగు గోపి పోస్టుతో నియోజకవర్గంలో వేడెక్కిన రాజకీయం

-ఇదంతా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆడిస్తున్న రాజకీయ ఆట అంటూ ప్రత్యర్థి వర్గాల విశ్లేషణ

-సీనియర్లను అదుపులో ఉంచేందుకే ఈ ఎత్తుగడ వేశారంటూ స్థానికంగా గుసగుసలు



పాలకుర్తి నవంబర్ 14 (మహాప్రభ)

పాలకుర్తి నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీలో సోషల్ మీడియా వేదికగా మొదలైన అసమ్మతి చిచ్చు ఇప్పుడు కొత్త మలుపు తిరిగింది. పాలకుర్తి మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ వ్యవహారశైలిని తప్పుబడుతూ బిఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడు జోగు గోపి రాసిన బహిరంగ లేఖ నియోజకవర్గంలో సంచలనం రేపుతోంది. అయితే, ఈ వ్యవహారం వెనుక మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వ్యూహం ఉందనే చర్చ ఇప్పుడు రాజకీయ వర్గాల్లో జోరుగా సాగుతోంది.

తెరవెనుక ఎర్రబెల్లి వ్యూహం ఉందా?

పార్టీలో ఒకే వ్యక్తి కేంద్రంగా వ్యవస్థ నడుస్తోందని, సీనియర్లకు గౌరవం దక్కడం లేదని జోగు గోపి తన పోస్టులో ఆవేదన వ్యక్తం చేశారు. పైకి ఇది కింది స్థాయి నాయకుల మధ్య విభేదాల్లా కనిపిస్తున్నప్పటికీ, ఇదంతా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆడిస్తున్న రాజకీయ ఆట అని కొందరు స్థానిక విశ్లేషకులు మరియు ప్రత్యర్థి వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

సీనియర్లపై ఒత్తిడి:

మండల స్థాయిలో బలంగా ఉన్న సీనియర్ నాయకులను తన కనుసన్నల్లో ఉంచుకోవడానికి, వారి ప్రాధాన్యతను తగ్గించడానికి ఈ తరహా చర్చలను పరోక్షంగా ప్రోత్సహిస్తున్నారని కొన్ని వర్గాలు ఆరోపిస్తున్నాయి.

ప్రత్యామ్నాయ నాయకత్వం:

ఒక వర్గాన్ని మరో వర్గంతో కట్టడి చేయడం ద్వారా నియోజకవర్గంలో తన పట్టు సడలకుండా ఎర్రబెల్లి జాగ్రత్త పడుతున్నారని విమర్శకులు పేర్కొంటున్నారు.

పార్టీ శ్రేణుల్లో గందరగోళం:

మరోవైపు, మాజీ మంత్రికి తెలియకుండా మండల స్థాయిలో ఇంతటి బహిరంగ విమర్శలు రావడం అసాధ్యమని, అధిష్టానం మౌనం వెనుక బలమైన కారణమే ఉందని కార్యకర్తలు చర్చించుకుంటున్నారు.

మద్దతుదారుల వాదన మరోలా..

అయితే, ఎర్రబెల్లి దయాకర్ రావు మద్దతుదారులు మాత్రం ఈ ఆరోపణలను తోసిపుచ్చుతున్నారు. పార్టీ బలోపేతం కోసం అందరినీ కలుపుకొని వెళ్లడమే దయన్న లక్ష్యమని, సోషల్ మీడియాలో వచ్చే వ్యక్తిగత అభిప్రాయాలను ఆయనకు ఆపాదించడం సరికాదని వారు స్పష్టం చేస్తున్నారు.

మొత్తానికి, పాలకుర్తి గులాబీ దళంలో రేగిన ఈ చిచ్చు సాధారణ అసంతృప్తా లేక అగ్రనాయకత్వం ఆడిస్తున్న వ్యూహాత్మక నాటకమా అనేది నియోజకవర్గ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

ఆగి ఉన్న లారీని ఢీకొని మాచాపూర్ యువకుడు మృతి

-మల్లయ్యపల్లి గేటు సమీపంలో ప్రమాదం..

-ఆసుపత్రిలో చికిత్స పొందుతూ యువకుడి మృతి



ఎల్లారెడ్డి, నవంబర్ 14, (మహాప్రభ)

రహదారి పక్కన ఆగి ఉన్న లారీని ద్విచక్రవాహనం ఢీకొనడంతో ఓ యువకుడు మృతిచెందాడు. ఈ ఘటన ఎల్లారెడ్డి మండలంలోని మల్లయ్యపల్లి శివారులో శు క్రవారం రాత్రి చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మాచాపూర్ (పెద్దారెడ్డి) గ్రామానికి చెందిన పరమేశ్వర్ ఇంటి అవసరాల నిమిత్తం ద్విచక్రవాహనంపై ఎల్లారెడ్డికి వచ్చి తిరిగి స్వగ్రామానికి వెళ్తున్నాడు. ఈ క్రమంలో మల్లయ్యపల్లి గేటు సమీపంలో రహదారిపై ఆగి ఉన్న లారీని ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన పరమేశ్వర్‌ను స్థానికులు అంబులెన్స్‌లో ఎల్లారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందినట్లు గ్రామస్థులు తెలిపారు.

ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

భక్తిభావంతో ఉప్పొంగిన కురుమూర్తి క్షేత్రం..
వైభవంగా స్వామివారి ఆభరణాల ఊరేగింపు





స్వామివారి నగలను నెత్తిన మోసిన మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి.. భక్తులతో కలిసి కోలాటం, డప్పుల సందడి

మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 14 మహా ప్రభ

తెలంగాణ తిరుపతిగా, పేదల తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలకు భక్తిభావ వాతావరణంలో అంగరంగ వైభవంగా శ్రీకారం చుట్టారు. స్వామివారి బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన ఘట్టమైన ఆభరణాల ఊరేగింపు శనివారం భక్తుల జయజయధ్వానాలు, మంగళవాయిద్యాలు, బ్యాండ్ మేళాల నడుమ కన్నులపండువగా సాగింది. ఆత్మకూరు పట్టణంలోని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ)లో భద్రపరిచిన స్వామివారి అమూల్యమైన ఆభరణాలను ప్రత్యేక పూజల అనంతరం ఆలయానికి తీసుకెళ్లేందుకు ఊరేగింపుగా బయలుదేరారు. ఈ సందర్భంగా పరమేశ్వరుని ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజల్లో రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి, దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి (జీఎంఆర్) పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

స్వామివారి ఆభరణాలను నెత్తిన మోసిన మంత్రి, ఎమ్మెల్యే

ఈ ఊరేగింపులో భక్తులను విశేషంగా ఆకట్టుకున్న దృశ్యం మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి స్వయంగా స్వామివారి ఆభరణాలను నెత్తిన మోస్తూ భక్తి ప్రపత్తులతో ముందుకు సాగడం. పదవీ హోదాలను పక్కనపెట్టి స్వామివారి సేవలో సామాన్య భక్తుల్లా పాల్గొన్న ప్రజాప్రతినిధుల దృశ్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి.

మంత్రి వాకిటి శ్రీహరి స్వామివారి ఆభరణాలను శిరస్సుపై ధరించి భక్తిశ్రద్ధలతో ఊరేగింపులో పాల్గొనగా, ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి సైతం స్వామివారి నగలను మోస్తూ తన భక్తిని చాటుకున్నారు. భక్తులతో కలిసి కోలాటం ఆడుతూ, డప్పులు మోగిస్తూ, మంగళవాయిద్యాల నడుమ సాగిన ఈ ఊరేగింపు ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. అడుగడుగునా స్వామివారి నామస్మరణలు, భక్తుల హర్షధ్వానాలతో ఆత్మకూరు పట్టణం కురుమూర్తి స్వామి నామస్మరణతో మార్మోగింది.

నెల రోజుల పాటు భక్తజన సంద్రంగా కురుమూర్తి క్షేత్రం

కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు కేవలం ఉత్సవాలు మాత్రమే కాదు.. తరతరాలుగా కొనసాగుతున్న భక్తి సంప్రదాయానికి, ఆధ్యాత్మిక వైభవానికి ప్రతీకలు. దాదాపు నెల రోజుల పాటు జరిగే ఈ జాతరకు తెలంగాణలోని వివిధ జిల్లాల నుంచే కాకుండా పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్రల నుంచి కూడా వేలాదిగా భక్తులు తరలివస్తారు.స్వామివారి ఆభరణాల ఊరేగింపుతో కురుమూర్తి బ్రహ్మోత్సవాల సందడి మరింత ఊపందుకుంది. భక్తి, సంప్రదాయం, ఆధ్యాత్మికత కలగలిసిన ఈ వేడుకలో మంత్రి వాకిటి శ్రీహరి, ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి స్వయంగా ఆభరణాలను మోస్తూ పాల్గొనడం ఈ ఏడాది ఉత్సవాల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గోవిందా.. గోవిందా.. కురుమూర్తి స్వామి గోవిందా! అంటూ భక్తుల నినాదాలతో కురుమూర్తి క్షేత్రం భక్తిపారవశ్యంలో మునిగిపోయింది.

ప్రభుత్వ ఆసుపత్రుల కార్మికులు వేతన పెంపు కోరుతూ ధర్నా, సమ్మె హెచ్చరిక



హైదరాబాద్, (నవంబర్ 14) మహా ప్రభ

ప్రభుత్వ ఆసుపత్రుల్లోని శానిటేషన్, పేషెంట్కేర్, సెక్యూరిటీ కార్మికులు వేతనాల పెంపు, సెలవుల అమలు, బోనస్, యూనిఫాం, 1వ తేదీన వేతనాలు, సక్రమ ఇఎస్ఐ-పీఎఫ్ జమ కోసం హెచ్చరిక జారీ చేశారు. డిమాండ్లు నెరవేరకపోతే నవంబర్ 12 నుంచి ప్రతిరోజు ధర్నాలు, స్పందన రాకపోతే నవంబర్ 28 నుంచి సమ్మెకు దిగుతామని ప్రకటించారు.రాష్ట్ర అధ్యక్షులు యం. యూసుఫ్, ప్రధాన కార్యదర్శి యం. నర్సింహలు మెడికల్ సూపరింటెండెంట్కు పంపిన విజ్ఞప్తిలో.. నాలుగేళ్లుగా వేతనాలు పెరగలేదని, జీవో నెం.6 ప్రకారం కనీసం రూ.16 వేలు ఉన్నా పది-ఇరవై ఏళ్ల సర్వీసు ఉన్నవారికి రూ.26 వేలు చెల్లించాలని కోరారు. పండగ, జాతీయ, ఆర్జిత సెలవులు, వార్షిక బోనస్, రెండు జతల యూనిఫాం ఇవ్వాలన్నారు.కాంట్రాక్టర్లు ఇఎస్ఐ, పీఎఫ్లు సరిగా జమ చేయడం లేదని, చట్టప్రకారం పూర్తి వేతనంపై జమ చేయాలని గుర్తు చేశారు. గత ఆగస్టు 9న మంత్రి దామోదర రాజనర్సింహ, డీఎంఈ హామీ ఇచ్చినా ఉస్మానియా మినహా ఏ ఆసుపత్రిలోనూ 1వ తేదీన వేతనాలు చెల్లించడం లేదన్నారు. డీఎంఈ, వైద్య విధాన పరిషత్ కమీషనర్, కాంట్రాక్టర్లకు పంపారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు వాట్ సింగం విద్యార్థులు

-వాలీబాల్, కబడ్డీలో సత్తా చాటిన విద్యార్థులు







గాంధారి: నవంబర్ 14 (మహా ప్రభ)

రాష్ట్ర స్థాయి పాఠశాల క్రీడల సమాఖ్య 14 సంవత్సరాల లోపు వాలీబాల్ క్రీడా పోటీలకు గాంధారి మండలం పేట్ సంగం ఉన్నత పాఠశాలకు చెందిన మూడ్ రామ్ చరణ్, తేజస్విని ఎంపికైనట్లు వ్యాయామ ఉపాధ్యాయుడు లక్ష్మణ్ రాథోడ్ తెలిపారు. ఈ నెల 12న పాల్వంచ మండల కేంద్రంలోని ఆర్.ఆర్. పాఠశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలో అద్భుతంగా ఆడి, ఉమ్మడి జిల్లా స్థాయి పోటీలో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ఆయన తెలిపారు.ఈ నెల 13 నుండి 16 వరకు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని దౌల్తాబాద్ లో జరుగుతున్న రాష్ట్ర స్థాయి పోటీలకు వీరు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తారు.అదేవిధంగా గుడివేనక తండాకు చెందిన భూక్యా అర్జున్ 16 సంవత్సరాల లోపు సబ్ జూనియర్ కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 13 నుండి 16 వరకు వికారాబాద్ జిల్లా కేంద్రంలో జరుగుతున్న కబడ్డీ పోటీలకు కామారెడ్డి జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. భూక్యా అర్జున్ భారత క్రీడా ప్రాధికార సంస్థ హాస్టల్ లో శిక్షణ పొందు తున్నారు. ఎంపికైన క్రీడాకారులకు ఉపాధ్యాయ బృందం, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

నవంబర్ 15నుండి 18 వరకు నల్గొండలో జరిగే రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయండి



దేవరకొండ నవంబర్ 14(మహా ప్రభ)

బహిరంగ సభ పోస్టర్లు ఆవిష్కరించిన నాయకులు నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్) జాతీయ మహాసభలను విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి తుమ్మల వీరారెడ్డి పిలుపునిచ్చారు, శనివారం నాడు మండల కేంద్రంలో ఎ ఐ కె ఎస్.జాతీయ మహాసభల పోస్టర్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి చారిత్రక నేపథ్యమున్న నల్గొండ గడ్డపై జాతీయ మహాసభలు నిర్వహించడం ప్రత్యేక ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. నవంబర్ 15న లక్షలాది మంది రైతులతో మహా ప్రదర్శన, బహిరంగ సభలి నిర్వహించనున్నట్లు తెలిపారు.దేశవ్యాప్తంగా 4000లకు పైగా ప్రతినిధులు ఈ మహాసభల్లో పాల్గొంటున్నారని అన్నారు. దేశంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమరశీల పోరాటాలకు రూపకల్పన జరుగుతోందన్నారు, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు చేసుకుని వ్యవసాయ రంగాన్ని విదేశీ కార్పొరేట్లకు అప్పగిస్తున్నారని విమర్శించారు,రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరల చట్టం చేయాలంటే మాత్రం మోడీ ప్రభుత్వం అంగీకరించడం లేదన్నారు,ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న జాతీయ మహాసభలలో వ్యవసాయ రంగాన్ని రక్షించుకోవడం రైతుల ప్రయోజనాలను కాపాడుకోవడం కోసం అఖిల భారత రైతు సంఘం మహాసభలలో తీర్మానాలు చేయనున్నట్లు తెలిపారు, ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు నల్లా వెంకటయ్య,కంబాలపల్లి ఆనందు,కంభంపాటి శంకర్,బుడిగ వెంకటేష్,నాగంటి నాగరాజు,కావాలి కృష్ణయ, పుడుగుండ్ల రాములు, బిజిలి లింగయ్య, పెరిక విజయ్ కుమార్,నల్ల శీను,బుడిగ వెంకటేష్, ఎండి రహీమ్, అంకురి శ్రీకాంత్,సభావాత్ వినోద్, ఏన్నపోతుల పరమేష్,తరమ్మా, ముత్తమ్మ,జైరాం, మహేష్,తదితరులు పాల్గొన్నారు.తదితరులు పాల్గొన్నారు.

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పండిత్ చెవర్లాల్ నెహ్రు 137 వ జయంతి వేడుకలు మరియు బాలల దినోత్సవం వేడుకలు



దేవరకొండ నవంబర్ 14(మహా ప్రభ)

దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనము నందు ఈరోజు ఉదయం 12 గంటలకు బాలల దినోత్సవం మరియు జవహర్లాల్ నెహ్రూ 137వ జయంతి సందర్భంగా అధ్యక్షుడు ఎన్.వి. టి. సభ్యులతో మరియు విద్యార్థులతో కలిసి పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించినారు. అనంతరం వారు మాట్లాడుతూ భారతదేశ మొదటి ప్రధానమంత్రి, ప్రముఖ న్యాయవాది అని. నెహ్రూకి పిల్లలంటే ఎంతో ఇష్టం. పిల్లలు ఆయన్ను ప్రేమగా "చాచా నెహ్రూ" అని పిలుచుకునేవారు అని, పిల్లల సంక్షేమం, విద్య మరియు వారి హక్కుల గురించి ఆయన ఎంతో ఆలోచించేవారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తాళ్ల శ్రీధర్ గౌడ్, కోశాధికారి కృష్ణ కిషోర్, బత్తుల అమర్, రాపోలు నిరంజన్, తాళ్ల సురేష్, శ్రీనయ్య, కరాటే మాస్టర్ గోపి, మహేందర్ ,ఆదిత్య, శివానంద్, శ్రీరామ్, సహర్షా రెడ్డి రాజేందర్ క్రీడాకారులు కళాకారులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

యువకుడికి జాతీయ స్థాయిలో 4 బంగారు పతకాలు

-చరణ్ కు ప్రజా ప్రతినిధుల అభినందనలు





గాంధారి నవంబర్ 14 (మహాప్రభ)

కామారెడ్డి జిల్లా గాంధారి మండలం నాగ్లూర్ గ్రామానికి చెందిన సిహెచ్ చరణ్, జాతీయ స్థాయిలో సత్తా చాటాడు.హైదరాబాద్ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ రూపేందర్ సింగ్ గారు, తరగతి ఉపాధ్యాయురాలు ఆస్థా తివారి గారి సహకారంతో చరణ్ 2025-26 సంవత్సరంలో జరిగిన 19 సంవత్సరాల లోపు జాతీయ వాలీబాల్ పోటీలలో పాల్గొని 4 బంగారు పతకాలు సాధించిన ఈ పోటీలు హైదరాబాద్, మధ్యప్రదేశ్ లో జరిగాయి. చరణ్ కు ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, మాజీ పార్లమెంట్ సభ్యులు బీబీ పాటిల్, మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు తానాజీ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్ బండారి పరమేశ్వర్, మండల ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలు అభినందనలు తెలిపారు.

భక్తి మార్గంలో అడుగులు.. మన్యంకొండ స్వామి సన్నిధికి ఉమారాజు పాదయాత్ర

భక్తిశ్రద్ధలతో కాలినడకన బయలుదేరిన 4వ వార్డు కౌన్సిలర్.. వెంట నడిచిన దేవరకద్ర భక్తజనం



మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 14 (మహాప్రభ)

భక్తికి పదవులు అడ్డుకావు.. స్వామివారిపై ఉన్న నమ్మకానికి హోదాలు అవసరం లేదు.. ఆ భక్తి మనసులో ఉంటే అడుగడుగునా ఆధ్యాత్మికతే కనిపిస్తుంది. ఇందుకు నిదర్శనంగా నిలిచారు దేవరకద్ర మున్సిపాలిటీ 4వ వార్డు కౌన్సిలర్ ఉమారాజు. తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మహబూబ్నగర్ జిల్లా మన్యంకొండ శ్రీ లక్ష్మీ వేంకటేశ్వర స్వామివారి సన్నిధికి చేరుకునేందుకు కౌన్సిలర్ ఉమారాజు శనివారం దేవరకద్ర నుంచి భక్తిశ్రద్ధలతో పాదయాత్ర చేపట్టారు.స్వామివారిపై అచంచలమైన విశ్వాసంతో, గోవింద నామస్మరణను మనసులో నింపుకుని కాలినడకన సాగిన ఈ ఆధ్యాత్మిక ప్రయాణం భక్తులను ఆకట్టుకుంది. ఎండా, దారిలోని అలసటను లెక్కచేయకుండా భక్తి భావంతో అడుగులు ముందుకు వేస్తూ ఉమారాజు పాదయాత్ర కొనసాగించారు. ఆయన వెంట దేవరకద్ర గ్రామానికి చెందిన పలువురు భక్తులు సైతం ఉత్సాహంగా పాల్గొని పాదయాత్రలో భాగస్వాములయ్యారు. సాధారణంగా స్వామివారి దర్శనానికి వాహనాల్లో వెళ్లడం ఒక పద్ధతి అయితే, భక్తిని ఆచరణలో చూపిస్తూ కాలినడకన స్వామివారి చెంతకు చేరుకోవడం ప్రత్యేకమైన ఆధ్యాత్మిక అనుభూతి. ప్రతి అడుగులో భక్తి.. ప్రతి మలుపులో గోవింద నామస్మరణ.. ప్రతి అడుగులోనూ స్వామివారిపై అచంచలమైన విశ్వాసం కనిపించేలా ఈ పాదయాత్ర సాగింది. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను నిర్వర్తిస్తూనే ఆధ్యాత్మిక సంప్రదాయాలకు ప్రాధాన్యతనిస్తూ పాదయాత్ర చేపట్టిన కౌన్సిలర్ ఉమారాజు భక్తుల దృష్టిని ఆకర్షించారు. భక్తి అనేది మాటల్లో చెప్పుకునేది కాదు.. మనస్ఫూర్తిగా ఆచరించి చూపించేదనే సందేశాన్ని ఈ పాదయాత్ర చాటిచెప్పింది. దేవరకద్ర నుంచి మన్యంకొండ వరకు సాగిన ఈ భక్తి పయనం భక్తి, విశ్వాసం, ఆధ్యాత్మికతకు ప్రతీకగా నిలిచింది.

పెద్ద పోతంగల్‌లో వోల్టేజ్ సమస్యకు పరిష్కారం

-రెండు కొత్త ట్రాన్స్ ఫార్మర్లు ఏర్పాటు, కాలనీ వాసుల హర్షం



గాంధారి నవంబర్ 14 (మహాప్రభ)

గాంధారి మండలం పెద్ద పోతంగల్ గ్రామంలో గత కొన్ని రోజులుగా వెనుకబడిన తరగతుల కాలనీలో తక్కువ విద్యుత్ సరఫరా సమస్య ఉండటంతో శాసన సభ్యులు మదన్ మోహన్ రావు, దృష్టికి తీసుకువెళ్లడం జరిగింది. వెంటనే స్పందించిన శాసన సభ్యులు విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి, తక్షణమే రెండు 25 కె.వి.ఎ. ట్రాన్స్ ఫార్మర్లు మంజూరు చేయించారు. వాటిని శనివారం రోజున బిగించారు. దీంతో కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వడ్ల అనుశ్రీ బాలరాజ్, ఉప సర్పంచ్ సంజీవ్ రెడ్డి, వార్డు సభ్యులు గొల్లపల్లి ప్రశాంత్, వడ్ల శ్రీకాంత్ చారి, నేనావత్ బాలు, కర్రోళ్ల ప్రశాంత్, సహాయక విభాగ ఇంజనీర్ చికోటి మల్లేష్, సహాయక ఇంజనీర్ నాగరాజు, లైన్ మెన్ దూది తిరుపతి రెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

డా. కొర్ర కిషన్ నాయక్‌ను (వి డి.ఎస్.) ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.



దేవరకొండ నవంబర్14(మహా ప్రభ)
ఈ సందర్భంగా డా. కొర్ర కిషన్ నాయక్ మాట్లాడుతూ, ప్రతి పౌరుడు సమాచార హక్కు చట్టం--2005పై సంపూర్ణ అవగాహన కలిగి ఉండాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ కార్యాలయాల్లో పారదర్శకత, జవాబుదారీతనం పెంపొందించడంతో పాటు ప్రభుత్వ పాలనలో ప్రజల భాగస్వామ్యాన్ని బలోపేతం చేయడంలో సమాచార హక్కు చట్టం కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ప్రభుత్వ శాఖల్లో ప్రజలకు సంబంధించిన సమాచారం అందుబాటులో ఉండటం ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎంతో అవసరమని తెలిపారు. ప్రతి పౌరుడు తన హక్కులను తెలుసుకోవడంతో పాటు సమాచార హక్కు చట్టంలోని నిబంధనలను అవగాహన చేసుకొని, చట్టాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రజల్లో చట్టాలపై అవగాహన కల్పించడం, ప్రభుత్వ పాలనలో పారదర్శకతను ప్రోత్సహించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని స్పష్టం చేశారు. ముఖ్యంగా మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన పెంపొందించుకొని సామాజిక అభివృద్ధిలో చురుకైన పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. విలేజ్ డెవలప్‌మెంట్ సొసైటీ (విడి. ఎస్.) ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో డా. బాషా చౌహాన్‌తో పాటు ఎన్. శాంతి, బి. నిహారిక, కె. కవిత, లహరి మరియు శిక్షణ పొందుతున్న మహిళలు కూడా ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా సమాచార హక్కు చట్టం--2005 ప్రాముఖ్యత, దాని ద్వారా సామాన్య ప్రజలకు కలిగే ప్రయోజనాలు, ప్రభుత్వ కార్యాలయాల్లో సమాచార పారదర్శకత ఆవశ్యకతపై అవగాహన కల్పించారు. ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తూ, సమాచార హక్కు చట్టం సమర్థవంతమైన అమలు కోసం కృషి చేయడం అభినందనీయమని కార్యక్రమంలో పాల్గొన్న పలువురు అభిప్రాయపడ్డారు.

రహదారులపై ధాన్యం ఆరబెడితేచర్యలుతప్పవు!

-ప్రమాదాలకు కారణంకావొద్దు.

-.రైతులకుపాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ హెచ్చరిక



పాపన్నపేట నవంబర్14(మహాప్రభ)
రహదారులపై ధాన్యం ఆరబెట్టి వాహనదారుల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టవద్దని పాపన్నపేట ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ రైతులకు సూచించారు. రహదారులు వాహనాల రాకపోకల కోసమేనని, ధాన్యం ఆరబెట్టేందుకు కాదని స్పష్టం చేశారు. రహదారులపై ధాన్యం ఆరబెట్టి ప్రమాదాలకు కారణమైతే సంబంధిత వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.శనివారం యూసుఫ్‌పేటవద్దరహదారిపై ధాన్యం ఆరబెడుతున్న రైతులకు ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. రహదారులపై ధాన్యం కుప్పలు పోయడం, ధాన్యం ఆరబెట్టడం వల్ల వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయంకలుగుతుందని తెలిపారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో రహదారిపై ఆరబెట్టిన ధాన్యం వాహనదారులకు సరిగా కనిపించక ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. ద్విచక్ర వాహనదారులు ధాన్యంపై ప్రయాణించే క్రమంలో అదుపుతప్పి కిందపడితే ప్రాణాపాయం సంభవించే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. పంటను కాపాడుకునే క్రమంలో ఇతరుల ప్రాణాలకు ముప్పు కలిగించవద్దని రైతులకు హితవు పలికారు. రహదారులకు దూరంగా పొలాల్లో లేదా ఇతర అనువైన ప్రదేశాల్లోనే ధాన్యం ఆరబెట్టుకోవాలని సూచించారు.రహదారులపై ధాన్యంఆరబెట్టిప్రమాదాలకు కారణమైన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. రైతులు పోలీసుల సూచనలు పాటిస్తూ రోడ్డు ప్రమాదాలనివారణకుసహకరించాలని ఆయన కోరారు.ప్రజల ప్రాణ భద్రతను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ బాధ్యతగావ్యవహరించాలని కోరారు.

జిల్లా సారథి ఉద్యోగాలు కేటాయించాలి

-సారథి చైర్‌పర్సన్ వెన్నెల జన చైతన్య కళాకారుల సంఘం



గాంధారి నవంబర్ 14 (మహాప్రభ)
కామారెడ్డి జిల్లాకు రావాల్సిన సారథి ఉద్యోగాలను కేటాయించాలని కోరుతూ జన చైతన్య కళాకారుల సంఘం కామారెడ్డి జిల్లా బృందం తెలంగాణ సారథి చైర్‌పర్సన్ వెన్నెల అక్కను మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించే దిశగా జిల్లాకు తగిన సంఖ్యలో సారథి ఉద్యోగాలు కేటాయించాలని చైర్‌పర్సన్‌ను కోరారు. స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం ద్వారా వారి కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడంతో పాటు జిల్లాలో ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయని ప్రతినిధులు వివరించారు. కామారెడ్డి జిల్లా యువతకు న్యాయం జరిగేలా ఉద్యోగాల కేటాయింపు విషయంలో సానుకూలంగా పరిశీలించాలని విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో జన చైతన్య కళాకారుల సంఘం కామారెడ్డి జిల్లా అధ్యక్షులు కాగుల మోహన్ యాదవ్, అధ్యక్షులు రాము పటేల్, ప్రధాన కార్యదర్శి బిట్ల సురేందర్, కోశాధికారి మొహమ్మద్ మైను, ఇమామ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

బావిలో పడి వృద్ధుడి మృతి

-అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందినట్లు అనుమానం



తాడ్వాయి, నవంబరు 14 (మహాప్రభ):
మండలంలోని యెర్రపహాడ్ గ్రామంలో విషాదం చోటుచేసుకుంది. ఎర్ర పహాడ్ గ్రామానికి చెందిన ఎనుగు బాల్రెడ్డి (70) అనే వృద్ధుడు బావిలో పడి మృతి చెందాడు. రెండు రోజులుగా కనిపించకుండా పోయిన ఆయన మృతదేహం శనివారం గ్రామ శివారులోని బావిలో లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎనుగు బాల్రెడ్డి గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ నెల 12న మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో తన టీవీఎస్ ఎక్స్‌ఎల్ మోపెడ్‌పై ఇంటి నుంచి బయటకు వెళ్లేందుకు సిద్ధమయ్యాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో వాహనం నడుపుతూ కిందపడే ప్రమాదం ఉందని కుమారుడు లక్ష్మారెడ్డి వారించడంతో, ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయాడు. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు, బంధువులు గ్రామంతోపాటు పరిసర ప్రాంతాల్లో గాలించారు. అదే రోజు సాయంత్రం 4 గంటల సమయంలో గ్రామంలోని కల్లు దుకాణం వద్ద బాల్రెడ్డిని చూసినట్లు అక్కడ పనిచేసే రాజేశ్వర్‌గౌడ్, కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చాడు. అయినప్పటికీ ఆయన ఆచూకీ లభించలేదు. ఈ క్రమంలో శనివారం ఉదయం 11.15 గంటల సమయంలో గ్రామానికి చెందిన హరళి శ్రవణ్‌రావు బాల్రెడ్డి కోసం వెతుకుతుండగా, కోతోళ్ల ముకేష్‌గౌడ్‌కు చెందిన బావిలో ఓ వ్యక్తి మృతదేహం నీటిపై తేలుతూ కనిపించింది. వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. వారు అక్కడికి చేరుకుని పరిశీలించగా మృతదేహం బాల్రెడ్డిదిగా గుర్తించారు. బావి వద్దకు స్నానం చేసేందుకు వెళ్లిన సమయంలో ప్రమాదవశాత్తు నీటిలో పడిపోయి, ఈత రాకపోవడంతో మునిగి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు ప్రాథమికంగా భావిస్తున్నారు. తన తండ్రి మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని కుమారుడు పోలీసులకు తెలిపాడు. ఘటనపై తాడ్వాయి పోలీసులు కేసు నమోదు చేశారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించారు. తదుపరి చట్టపరమైన చర్యలు చేపడుతున్నట్లు ఎస్సై తెలిపారు.

భారత్ సమ్మిట్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, ఝాన్సీ రాజేందర్ రెడ్డి

-రెండో రోజు అంతర్జాతీయ సదస్సుకు హాజరు..

-కీలక అంశాలపై చర్చల్లో పాల్గొన్న నేతలు



పాలకుర్తి నవంబర్ 14 (మహాప్రభ)
హైదరాబాద్‌లో కొనసాగుతున్న అంతర్జాతీయ స్థాయి భారత్ సమ్మిట్‌లో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు, ఔజూూ వ్యవస్థాపకురాలు, అధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్ రెడ్డి రెండో రోజు కార్యక్రమాలకు హాజరయ్యారు. ఫోర్జింగ్ ఎ న్యూ వరల్డ్' ఇతివృత్తంతో సాగుతున్న ఈ సదస్సులో నిర్వహించిన వివిధ వేదికలపై జరిగిన చర్చలను వారు ఆసక్తిగా పరిశీలించడంతో పాటు, సమకాలీన ప్రపంచ సవాళ్లు, సమాజ పురోగతి, మహిళలకు సమాన అవకాశాలు, అంతర్జాతీయ సంబంధాల బలోపేతం వంటి అంశాలపై జరిగిన సమావేశాల్లో పాల్గొన్నారు. మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అనుగుణంగా అభివృద్ధి దిశగా అనుసరించాల్సిన విధానాలు, వివిధ రంగాల్లో మహిళల పాత్ర, దేశాల మధ్య పరస్పర సహకారం వంటి అంశాలు ఈ సదస్సులో ప్రధానంగా ప్రస్తావనకు వచ్చాయి.ఈ కార్యక్రమానికి దేశ, విదేశాలకు చెందిన ప్రముఖులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల నిపుణులు హాజరై తమ అభిప్రాయాలను వెల్లడించారు.

గ్రామపంచాయతీలో ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు



గాంధారి, నవంబర్ 14 (మహాప్రభ)
కామారెడ్డి జిల్లా గాంధారి మండల కేంద్రంలో గ్రామ సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్, ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, అధ్యక్షతన బాలల దినోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని పురస్కరించుకుని గాంధారి మండలంలోని గ్రామపంచాయతీలో బాలల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వ హించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ ఆవరణలో విద్యార్థులతో పాటలు పాడించడం జరిగింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రేణుక సంజీవ్ యాదవ్, ఉప సర్పంచ్ భాస్కర్ గౌడ్, ఉపాధ్యాయులు, ఐకేపీ సీసీ గొర్రె రాములు మాట్లాడుతూ, భారత తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని బాలల దినోత్సవంగా నిర్వహించుకుంటున్నామని, పిల్లలే దేశ భవిష్యత్తు అని తెలిపారు. విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. పిల్లలలో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు విద్యతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గాంధారి గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు యశోద భాయి, సంజీవులు, అశోక్ యాదవ్, శివాజీ, బాలమణి, పత్తి సాయిలు, సౌజన్య భాయి, మైసవ్వ, నితిన్ పాటిల్, లైన్ రమేష్, సంధ్యారాణి, శ్రీనివాస్, కారోబార్ నారాయణమూర్తి, గ్రామపంచాయతీ సిబ్బంది, మహిళా సంఘాల సభ్యులు, అంగన్వాడీ ఉపాధ్యాయులు బాలమణి, రాణి, కరుణ, లక్ష్మి, ఐకేపీ వీవోఏలు లావణ్య, కవితాదేవి, ప్రియాంక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయికి ఎంపికైన గాంధారి విద్యార్థులకు సన్మానం

-బాలల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ చేతుల మీదుగా సత్కారం



గాంధారి నవంబర్ 14(మహాప్రభ)
భారత ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల అక్షరాస్యత క్లబ్ వ్యాసరచన మరియు క్విజ్ పోటీలలో జిల్లా స్థాయికి ఎంపికైన గాంధారి మండలం విద్యార్థులను బాలల దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ రేణుక చౌహన్ సన్మానించారు.శుక్రవారం రోజున ఎల్లారెడ్డి నియోజకవర్గ స్థాయిలో నిర్వహించిన ఓటరు జాబితా ప్రాముఖ్యత అనే అంశంపై వ్యాసరచన, క్విజ్ పోటీలలో పేట్ సంగం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన మోతే శశాంక్ వ్యాసరచనలో ప్రథమ స్థానం సాధించగా, క్విజ్ పోటీలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యా లయానికి చెందిన బి. జ్యోతి జిల్లా స్థాయికి ఎంపిక కావడం జరిగింది. వారికి తహసీల్దార్ రేణుక చౌహన్ శాలువాతో సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ మున్ముందు రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలో ప్రతిభ చాటాలని విద్యార్థులకు తెలియజేశారు.ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు, గ్రామ ప్రజలందరూ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పేట్ సంగం ఉపాధ్యాయులు బండిరాజు, గంగ కుమార్, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయానికి చెందిన వి. కవిత తదితరులు పాల్గొన్నారు.

కురుమూర్తి స్వామి ఆభరణాల దర్శనానికి ఎంపీ డీకే అరుణ..

-భక్తిశ్రద్ధలతో ఆభరణాల ఊరేగింపు

-కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేక ఘట్టం.. ఘనంగా ప్రారంభమైన ఆభరణాల శోభాయాత్ర



మహబూబ్నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గం నవంబర్ 14 మహా ప్రభ
చిన్నచింతకుంట: తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గంలోని చిన్నచింతకుంట మండలం శ్రీశ్రీశ్రీ కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాలు భక్తిపారవశ్యంతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా స్వామివారి పవిత్ర ఆభరణాలను సంస్థానాధీశులు శ్రీరామ్ భూపాల్ గృహంలో భద్రపరిచి భక్తుల దర్శనార్థం ఉంచగా, బీజేపీ పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణ, బీజేపీ దేవరకద్ర నియోజకవర్గ ఇన్‌చార్జి కొండ ప్రశాంత్ రెడ్డి ప్రత్యేకంగా దర్శించుకుని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఆభరణాలను ప్రత్యేక అలంకరణలతో, బ్యాండ్ మేళాలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ కురుమూర్తి స్వామి ఆలయానికి ఊరేగింపుగా తీసుకెళ్లారు. ఈ ఆధ్యాత్మిక శోభాయాత్రతో పరిసర ప్రాంతమంతా భక్తి సందడితో మార్మోగింది. స్వామివారి ఆభరణాల దర్శనం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో అత్యంత విశిష్టమైన ఈ ఆభరణాల ఊరేగింపు జాతర వైభవాన్ని మరింత ఇనుమడింపజేసింది. భక్తుల హరివిల్లులాంటి సందడి, సంప్రదాయ వాయిద్యాల నడుమ సాగిన ఈ వేడుక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

ఐకేపీ కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేసిన డీఆర్డీఓ దామోదర్‌రెడ్డి

-కళ్యాణి, అన్నాసాగర్ కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లపై రైతులతో చర్చ..

-ఎఫ్‌ఏక్యూ ప్రమాణాల ప్రకారం ధాన్యం శుభ్రం చేసి తీసుకురావాలని సూచన



ఎల్లారెడ్డి, నవంబర్ 14, (మహాప్రభ):
ఎల్లారెడ్డి మండలంలోని కళ్యాణి, అన్నాసాగర్ ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను డీఆర్డీఓ దామోదర్‌రెడ్డి శనివారం సందర్శించారు. కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్ల పరిస్థితిని పరిశీలించి రైతులతో మాట్లాడారు. ప్రభుత్వ నిర్దేశిత ఎఫ్‌ఏక్యూ ప్రమాణాలకు అనుగుణంగా ధాన్యాన్ని శుభ్రం చేసి కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా రైతులు క్వింటాల్‌కు రూ.3,000 చొప్పున ప్రైవేటు వ్యాపారులు ధాన్యం కొనుగోలు చేస్తున్నారని డీఆర్డీఓకు తెలిపారు. అన్నాసాగర్ కేంద్రంలో రైతు కాశీరాంతో ఇటీవల ఈనాడు దినపత్రికలో ప్రచురితమైన 'ధాన్యం కొనుగోళ్లకు నిరీక్షణ' కథనంపై డీఆర్డీఓ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రైవేటు వ్యాపారులు క్వింటాల్‌కు రూ.3,000 చెల్లిస్తుండటంతో వారికే ధాన్యం విక్రయిస్తున్నామని రైతు వివరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డీపీఎం సాయిలు, ఏపీఎం రామ్‌నారాయణ గౌడ్, అన్నాసాగర్ సర్పంచ్ ప్రవంతి సాయ గౌడ్, ఉపసర్పంచ్ నాగరాజు, సీసీలు గోపాల్, రమేష్ గౌడ్, వీవోఏలు శివచరణ్, ఆంజనేయులు, గ్రామ రైతులు పాల్గొన్నారు.

మానవ సేవే మాధవ సేవ.. యలమంచి ఉదయ్ కిరణ్

-విజయవంతంగా 8 వ ఉచిత మెగా మెడికల్ క్యాంప్



శేరిలింగంపల్లి,(నవంబర్ 14) మహా ప్రభ
యలమంచి ఉదయ్‌కిరణ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో, మమతా అకాడమీ ఆఫ్ మెడికల్ సైన్సెస్ హాస్పిటల్ సహకారంతో నివ్రితి హోమ్స్‌లో నిర్వహించిన 8వ ఉచిత మెగా మెడికల్ క్యాంప్‌లో 300 మందికి పైగా ప్రజలకు ఉచిత వైద్య సేవలు అందించారు. ఉచిత పరీక్షలు, మందులు, రవాణా సౌకర్యం కల్పించారు. కాలనీవాసులు ఉదయ్‌కిరణ్ సేవలను అభినందించారు. మమతా హాస్పిటల్, నివ్రితి హోమ్స్ అధికారులు, వాలంటీర్లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఉదయ్‌కిరణ్ మాట్లాడుతూ..“ప్రజల ఆరోగ్యం, సంక్షేమమే మా ప్రాధాన్యం. మరిన్ని సేవా కార్యక్రమాలు కొనసాగిస్తాం” అన్నారు.

తిప్పారం తాండలో ఘనంగా నెహ్రూ జయంతి వేడుకలు

-చిన్నారులే దేశ భవిష్యత్తు అని తెలిపిన గ్రామస్తులు



గాంధారి నవంబర్ 14 (మహాప్రభ)
భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ జయంతిని గాంధారి మండలశీ తిప్పారం తాండ గ్రామస్తులు, చిన్నారులు ఘనంగా జరుపుకున్నారు. తిప్పారం తాండ గ్రామపంచాయతీ పరిధిలోగల అంగన్వాడీ కేంద్రంలో గ్రామ సర్పంచ్ గంగారాం అధ్యక్షతన జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి, బాలల ఆధ్వర్యంలో ఘనంగా నివాళులు అర్పించడం జరిగింది.ఈ సందర్భంగా మంజ్ పెంటయ్య మాట్లాడుతూ, వారు స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడి, సాగునీటి ప్రాజెక్టులు, ముఖ్యంగా విద్య, విజ్ఞానం మరియు ఆధునిక భారత నిర్మాణానికి విశేష కృషి చేశారని తెలిపారు. భారతదేశ తొలి ప్రధానమంత్రి పండిట్ జవహర్ లాల్ నెహ్రూ గారి జయంతి సందర్భంగా వారి సేవలను స్మరించుకుంటూ, వారి అడుగుజాడల్లో నడిచి బాలలు ప్రతిరోజు పాఠశాలకు వచ్చి విద్యా నేర్చుకుంటేనే మనం దేశానికి పట్టుకొమ్మల్లాగా తయారవుతామని బస్తీ తాన్ సింగ్ తెలిపారు. చిన్నారులే దేశ భవిష్యత్తు అని నమ్మిన చాచా నెహ్రూ వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని, బాలలందరూ విద్య, విజ్ఞానం ఉన్నత విలువలతో అభివృద్ధి చెందాలని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ ఉపాధ్యాయురాలు మంజ్ శారద, యువకులు శ్రీ చంద్, మంగల్ చంద్, గోపాల్ మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి బాలలే రేపటి నవ భారత నిర్మాతలు

-న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్

-ఘనంగా బాలల దినోత్సవ వేడుకలు

-కుంగ్ ఫు విద్యార్థులతో కలిసి చాచా నెహ్రూ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి నివాళులు



షాద్ నగర్ నవంబర్,14(మహా ప్రభ)
నేటి బాలలే రేపటి నవ భారత నిర్మాతలు అని తెలిపారు న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ మాస్టర్ అహ్మద్ ఖాన్. చాచా నెహ్రూ జయంతి సందర్భంగా షాద్ నగర్ పట్టణం లోని సత్యనారాయణ టెంపుల్ వద్ద న్యూ పవర్ కుంగ్ ఫు అకాడమీ విద్యార్థులతో కలిసి నెహ్రూ పటానికి పూలమాల వేసి కేక్ కట్ చేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాస్టర్ అహ్మద్ ఖాన్ మాట్లాడుతూ నేటి చిన్నారులే రేపటి తరానికి ఆదర్శం గా ఉండాలని వారి బంగారు భవిష్యత్తు కోసం మనమంతా కలిసి పనిచేద్దామని బాలల శ్రేయస్సే లక్ష్యంగా వారిని ఆదర్శంగా తీర్చి దిద్దుదామని అన్నారు. చిన్నారులందరికీ బాలల దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.

నేరాలకు పాల్పడిన ఏడుగురు నిందితుల అరెస్ట్!

-రెండు కత్తులు, సుత్తి, ద్విచక్ర వాహనం స్వాధీనం

సైబరాబాద్,(నవంబర్.14) మహాప్రభ
జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్న నేర ఘటనకు సంబంధించి ఏడుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం.. 2026 నవంబర్ 12వ తేదీ అర్ధరాత్రి సమయంలో బోయ కిషన్ పై జరిగిన దాడి పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.దర్యాప్తులో భాగంగా నిందితులను గుర్తించిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి రెండు కత్తులు, ఒక సుత్తి, ద్విచక్ర వాహనంతో పాటు ఇతర వస్తువులను స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.ఈ కేసులో ఏడుగురు నిందితులు ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న వస్తువులు:
రెండు కత్తులు,ఒక సుత్తి,ఒక ద్విచక్ర వాహనం.
పోలీసుల హెచ్చరిక
నేరాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలను ఉపేక్షించబోమని పోలీసులు హెచ్చరించారు.

పాలకుర్తి బీఆర్ఎస్‌లో వర్గపోరు.. అంతర్గత విభేదాలు బహిర్గతం!

-మండల అధ్యక్షుడు పసునూరి నవీన్ తీరుపై జోగు గోపి బహిరంగ అసంతృప్తి

-సోషల్ మీడియా పోస్టుతో గులాబీ శిబిరంలో కలకలం

-తెరవెనుక మాజీ మంత్రి ఎర్రబెల్లి రాజకీయ వ్యూహాలున్నాయంటూ ప్రత్యర్థి వర్గాల ఆరోపణలు

-సీనియర్ నాయకుల ప్రాధాన్యత తగ్గించే ప్రయత్నాలపై పార్టీలో చర్చ



పాలకుర్తి, నవంబర్ 14 (మహాప్రభ):
పాలకుర్తి నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీలో అంతర్గత విభేదాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. ఇన్నాళ్లూ అంతర్గతంగా సాగిన అసంతృప్తి ఇప్పుడు సామాజిక మాధ్యమాల వేదికగా బహిరంగ చర్చకు దారితీసింది. పాలకుర్తి మండల పార్టీ అధ్యక్షుడు పసునూరి నవీన్ వ్యవహారశైలిని ప్రశ్నిస్తూ బీఆర్ఎస్ సోషల్ మీడియా నాయకుడు జోగు గోపి చేసిన పోస్టు స్థానిక రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారింది. ఈ పరిణామంతో నియోజకవర్గ గులాబీ శిబిరంలో నెలకొన్న విభేదాలు మరోసారి తెరపైకి వచ్చాయి.

అసంతృప్తికి అసలు కారణమేంటి?
పార్టీలో కొందరికే ప్రాధాన్యత ఇస్తూ, సుదీర్ఘకాలంగా పార్టీ కోసం పనిచేస్తున్న సీనియర్ నాయకులను పక్కన పెడుతున్నారన్నది జోగు గోపి పోస్టులోని ప్రధాన అభ్యంతరంగా కనిపిస్తోంది. పార్టీ వ్యవహారాలు సమష్టి నిర్ణయాలతో సాగడం లేదని, ఒకే వ్యక్తి చుట్టూ నాయకత్వం కేంద్రీకృతమవుతోందన్న అసంతృప్తి ఆయన వ్యాఖ్యల్లో వ్యక్తమైంది. ఈ విమర్శలు మండల స్థాయిలో నాయకుల మధ్య నెలకొన్న విభేదాలను బహిర్గతం చేశాయి.

ఎర్రబెల్లి చుట్టూ రాజకీయ చర్చలు
ఈ వివాదం వెనుక మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు రాజకీయ వ్యూహాలు ఉన్నాయా? అన్న ప్రశ్న ఇప్పుడు నియోజకవర్గ రాజకీయ వర్గాల్లో వినిపిస్తోంది. సీనియర్ నాయకుల మధ్య సమతుల్యత కొనసాగించడం, పార్టీపై తన రాజకీయ పట్టును నిలుపుకోవడం కోసం అంతర్గత పరిణామాలను అనుకూలంగా మలుచుకుంటున్నారనే అభిప్రాయాలను ప్రత్యర్థి వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి. అయితే ఈ ఆరోపణలకు సంబంధించి ఎలాంటి నిర్ధారణ లేదు.

సీనియర్ల ప్రాధాన్యతపై అంతర్మథనం
మండల స్థాయిలో పార్టీకి అండగా నిలిచిన అనుభవజ్ఞులైన నాయకులకు తగిన గుర్తింపు లభించడం లేదన్న అసంతృప్తి కొంతకాలంగా కొనసాగుతోందని స్థానికంగా చర్చ జరుగుతోంది. నాయకుల మధ్య సమన్వయం లోపిస్తే పార్టీ క్షేత్రస్థాయి బలం దెబ్బతినే ప్రమాదం ఉందని కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిణామాలను కొందరు నాయకత్వ ఆధిపత్య పోరుగా అభివర్ణిస్తున్నారు.

మద్దతుదారుల నుంచి భిన్నమైన స్పందన
మరోవైపు, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అనుచరులు ఈ ప్రచారాన్ని ఖండిస్తున్నారు. పార్టీ ఐక్యత, బలోపేతమే ఆయన ప్రధాన లక్ష్యమని, వ్యక్తిగతంగా కొందరు సామాజిక మాధ్యమాల్లో చేసే వ్యాఖ్యలకు ఆయనను బాధ్యుడిగా చూపడం సమంజసం కాదని పేర్కొంటున్నారు. పార్టీలో చిన్నచిన్న అభిప్రాయ భేదాలు సహజమని, వాటిని రాజకీయ వ్యూహాలుగా చిత్రీకరించడం సరికాదని వారి వాదన.

అధిష్ఠానం స్పందనపై ఆసక్తి
ఒకవైపు సోషల్ మీడియా వేదికగా విమర్శలు, మరోవైపు నాయకుల మధ్య అంతర్గత అసంతృప్తి.. వెరసి పాలకుర్తి బీఆర్ఎస్‌లో రాజకీయ వాతావరణం వేడెక్కింది. ఈ విభేదాలకు పార్టీ నాయకత్వం ఎలా ముగింపు పలుకుతుంది? సీనియర్ నాయకులకు తిరిగి ప్రాధాన్యత కల్పిస్తుందా? లేక ఈ వివాదం మరింత ముదురుతుందా? అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. రానున్న రోజుల్లో పార్టీ పెద్దల స్పందన, నాయకుల మధ్య సమన్వయ ప్రయత్నాలు నియోజకవర్గ బీఆర్ఎస్ రాజకీయాల భవిష్యత్తును నిర్ణయించనున్నాయి.

ఇమాంపూర్ గ్రామంలో భారీ వాహనాల బీభత్సం!

-గంటల తరబడి ట్రాఫిక్ జామ్..

-గ్రామస్తుల తీవ్ర ఇబ్బందులు

-అల్లాపూర్ నుంచి ఇమాంపూర్ మీదుగా భారీ వాహనాల రాకపోకలతో అవస్థలు

-నాలుగు గంటల పాటు నిలిచిపోయిన వాహనాలు..

-అత్యవసర పనులపై వెళ్లేవారికి ఇక్కట్లు

-టోల్‌గేట్ ఫీజులు తప్పించుకునేందుకే ప్రత్యామ్నాయ మార్గంలో రాకపోకలా?

-రవాణా, పోలీసు శాఖల అధికారులు స్పందించి భారీ వాహనాలను నియంత్రించాలని గ్రామస్తుల డిమాండ్



తూప్రాన్, నవంబర్ 14,(మహాప్రభ)
మెదక్ జిల్లా తూప్రాన్ మండలం ఇమాంపూర్ గ్రామంలో భారీ వాహనాల రాకపోకలు గ్రామస్తులకు తీవ్ర ఇబ్బందులను కలిగిస్తున్నాయి. గ్రామంలోని ప్రధాన రహదారిపై నిరంతరం భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రజలు నిత్యం ట్రాఫిక్ సమస్యతో సతమతమవుతున్నారు. కనీసం గ్రామంలోని ఒక వైపు నుంచి మరో వైపుకు రోడ్డు దాటాలన్నా గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు భారీ వాహనాల రాకపోకల కారణంగా గ్రామంలో సుమారు నాలుగు గంటల పాటు తీవ్ర ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. దీంతో ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి. గ్రామంలోకి వెళ్లే, గ్రామం నుంచి బయటకు వచ్చే దారులు వాహనాలతో కిక్కిరిసిపోయాయి. ద్విచక్ర వాహనదారులు, ఆటోలు, కార్లతో పాటు నిత్యావసర పనుల నిమిత్తం వెళ్లే ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అత్యవసర పనులపై వెళ్లాల్సిన వారు సైతం గంటల తరబడి ట్రాఫిక్‌లో చిక్కుకుపోయి అవస్థలు పడాల్సి వచ్చింది. టోల్‌గేట్ ఫీజులు తప్పించుకునేందుకే ప్రత్యామ్నాయ మార్గమా? టోల్‌గేట్ వద్ద నిర్ణీత రుసుములు చెల్లించకుండా ఉండేందుకు కొన్ని చిన్న, పెద్ద వాహనాలు ప్రత్యామ్నాయ మార్గంగా అల్లాపూర్ నుంచి ఇమాంపూర్ మీదుగా రాకపోకలు సాగిస్తున్నాయని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ముఖ్యంగా భారీ వాహనాలు గ్రామంలోని ఇరుకైన రహదారుల గుండా ప్రయాణిస్తుండటంతో స్థానికులకు రాకపోకలు కష్టతరంగా మారుతున్నాయని పేర్కొంటున్నారు. టోల్‌గేట్ ఫీజులు ఆదా చేసుకునే ప్రయత్నంలో గ్రామ ప్రజలను ఇబ్బందులకు గురిచేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు.

అధికారుల పర్యవేక్షణ ఏదీ? గ్రామంలో భారీ వాహనాల రాకపోకలతో ఇంతటి సమస్య ఏర్పడుతున్నప్పటికీ రవాణా శాఖ, పోలీసు యంత్రాంగం తగిన స్థాయిలో స్పందించడం లేదని గ్రామస్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. గ్రామీణ రహదారుల సామర్థ్యాన్ని, ప్రజల భద్రతను పరిగణనలోకి తీసుకోకుండా భారీ వాహనాలు యథేచ్ఛగా తిరుగుతుండటం ప్రమాదాలకు దారితీసే అవకాశం ఉందని ఆందోళన చెందుతున్నారు. భారీ వాహనాల రాకపోకల వల్ల చిన్నపిల్లలు, వృద్ధులు, మహిళలు, పాఠశాలలకు వెళ్లే విద్యార్థులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే అంబులెన్స్ వంటి అత్యవసర సేవల వాహనాలు కూడా గ్రామంలోకి వెళ్లేందుకు, బయటకు వచ్చేందుకు ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అల్లాపూర్ నుంచి ఇమాంపూర్ వరకు భారీ వాహనాల నియంత్రణకు చర్యలు చేపట్టాలి ఈ సమస్యపై జిల్లా ఉన్నతాధికారులు, రవాణా శాఖ అధికారులు, పోలీసు అధికారులు తక్షణమే స్పందించాలని గ్రామస్తులు కోరుతున్నారు. అల్లాపూర్ నుంచి ఇమాంపూర్ గ్రామం మీదుగా భారీ వాహనాలు రాకపోకలు సాగించకుండా తగిన ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, అవసరమైన చోట నిషేధ సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు సిబ్బందితో నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే టోల్‌గేట్ ఫీజులు తప్పించుకునేందుకు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగిస్తున్న వాహనాలపై సంబంధిత అధికారులు విచారణ జరిపి, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. గ్రామ ప్రజల రాకపోకలకు ఆటంకం కలగకుండా భారీ వాహనాల ప్రయాణానికి స్పష్టమైన నియంత్రణ విధించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఇమాంపూర్ గ్రామానికి ట్రాఫిక్ కష్టాల నుంచి విముక్తి కల్పిస్తారా? లేక గ్రామస్తులు ఇలాగే ప్రతిరోజూ గంటల తరబడి రహదారులపైనే నిరీక్షించాల్సిన పరిస్థితి కొనసాగుతుందా? అని గ్రామ ప్రజలు ప్రశ్నిస్తున్నారు.

బాలల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక వేదిక.

-పిల్లల ప్రజావాణి"మెదక్ సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో బాలల హక్కుల పరిరక్షణకు జిల్లా యంత్రాంగం ప్రత్యేక చర్యలు.

-అదనపు కలెక్టర్ నగేష్



మెదక్ జిల్లా -14నవంబర్ (మహాప్రభ).
బాలల హక్కుల పరిరక్షణ, వారి సమస్యలు మరియు అభిప్రాయాలను నేరుగా తెలుసుకొని పరిష్కరించేందుకు తెలంగాణ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ ఆదేశాల మేరకు మెదక్ జిల్లాలో పిల్లల ప్రజావాణి కార్యక్రమాన్ని నవంబర్ 16, 2026న సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించనున్నట్లు అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు.అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ జిల్లా మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాలల హక్కుల వారోత్సవాల సందర్భంగా నవంబర్ 14 నుండి 20 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా, ముఖ్యంగా నిరుపేద, బలహీన వర్గాలకు చెందిన పిల్లలు తమ సమస్యలు, ఇబ్బందులు, ఫిర్యాదులు మరియు అభిప్రాయాలను స్వేచ్ఛగా తెలియజేసేందుకు ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ కార్యాలయ జిల్లా ప్రజావాణి నిర్వహించే ప్రదేశంలో ప్రత్యేకంగా పిల్లల ప్రజావాణి డెస్క్ ఏర్పాటు చేసి, పిల్లల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించడంతో పాటు వారి సమస్యలను సావధానంగా విని సంబంధిత శాఖల ద్వారా పరిష్కరించేందుకు చర్యలు తీసుకొనున్నామని చెప్పారు.ఈ కార్యక్రమంలో మహిళా మరియు శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ, వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ, కార్మిక శాఖ, సాంఘిక సంక్షేమ శాఖ, గిరిజన సంక్షేమ శాఖ తదితర సంబంధిత శాఖల అధికారులు పాల్గొని పిల్లలకు సంబంధించిన సమస్యలపై తక్షణ స్పందన తెలియజేయనున్నామన్నారు.బాలల భద్రత, విద్య, ఆరోగ్యం, పోషణ, రక్షణ, అభివృద్ధి, బాలలపై హింస, బాల కార్మికత్వం, బాల్యవివాహాలు తదితర అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించి, సంబంధిత శాఖలకు పంపించి పరిష్కార చర్యలు చేపట్టనున్నారు.పిల్లల నుంచి స్వీకరించిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి, తీసుకున్న చర్యలు, పరిష్కార స్థితిని నిరంతరం పర్యవేక్షించనున్నారు. ఫిర్యాదులు స్వీకరించే సమయంలో పిల్లల గోప్యత, భద్రత మరియు గౌరవానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వనున్నారు. పిల్లల గొంతుకను వినడం, వారి హక్కులను గౌరవించడం, వారి సమస్యలకు సత్వర పరిష్కారం చూపడం జిల్లా యంత్రాంగం బాధ్యత.ఈ కార్యక్రమంలో పిల్లలు స్వచ్ఛందంగా పాల్గొని తమ సమస్యలను తెలియజేయాలని జిల్లా అదనపు కలెక్టర్ చెప్పారు.బాలల హక్కుల పరిరక్షణలో అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ, బాలలందరికీ సురక్షితమైన, ఆరోగ్యకరమైన మరియు హక్కులతో కూడిన వాతావరణాన్ని కల్పించేందుకు కృషి చేయాలని తెలిపారు.



ధనుష్ 'ఓం' తెలుగు ట్రైలర్ విడుదల.. నవంబర్ 20న థియేటర్లలోకి!



కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ హీరోగా, 'అమరన్' వంటి బ్లాక్‌బస్టర్ హిట్ అందించిన దర్శకుడు రాజ్‌కుమార్ పెరియసామి దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అంటెసిపేటెడ్ యాక్షన్ థ్రిల్లర్ మూవీ 'ఓం'. ఈ చిత్రంలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి, టాలెంటెడ్ నటీమణులు సాయి పల్లవి, శ్రీలీల కీలక పాత్రల్లో నటిస్తున్నారు. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన తెలుగు ట్రైలర్‌ను చిత్ర యూనిట్ ప్రేక్షకుల ముందుకు తీసుకువచ్చింది. నిజ జీవిత సంఘటనల ఆధారంగా ఎర్రచందనం స్మగ్లింగ్ నేపథ్యంతో ఈ చిత్రాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. విడుదలైన ట్రైలర్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చింది. పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాలు, ఉత్కంఠభరితమైన కథాంశం ఈ సినిమా ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. ఇక ఈ చిత్రానికి యువ సంగీత సంచలనం సాయి అభ్యంకర్ సంగీతం అందిస్తుండటం విశేషం. భారీ తారాగణంతో అత్యున్నత నిర్మాణ విలువలతో రూపుదిద్దుకున్న ఈ చిత్రం నవంబర్ 20న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా విడుదల కానుంది.

'సీన్' ట్రైలర్ వచ్చేసింది..

- అంచనాలు పెంచుతున్న సూర్య-నస్లెన్ మైండ్ గేమ్!



కోలీవుడ్ స్టార్ హీరో సూర్య, టాలెంటెడ్ డైరెక్టర్ జీతూ మాధవన్ కాంబినేషన్‌లో వస్తున్న క్రేజీ మూవీ 'సీన్'. మలయాళ సెన్సేషన్స్ నజ్రియా నజీమ్, నస్లెన్ కీలక పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమాకు సంబంధించిన అఫీషియల్ ట్రైలర్ తాజాగా విడుదలై ప్రేక్షకులను విపరీతంగా ఆకట్టుకుంటోంది. 'ఆవేశం' వంటి బ్లాక్‌బస్టర్ సినిమాను తెరకెక్కించిన జీతూ మాధవన్ ఈ చిత్రాన్ని పూర్తి డార్క్ కామెడీ, యాక్షన్ మరియు ఇన్వెస్టిగేషన్ థ్రిల్లర్‌గా రూపొందించినట్లు ట్రైలర్ చూస్తే స్పష్టమవుతోంది. ఈ చిత్రంలో సూర్య పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో ఎవరినీ లెక్కచేయని తిరుగులేని లెజెండ్ కాప్ 'ఇన్‌బరాజ్' పాత్రలో కనిపించనున్నారు. కెరీర్ పీక్ స్టేజ్‌లో ఉన్నప్పుడు సడన్‌గా ఆయన ఉద్యోగానికి రాజీనామా చేయాలని నిర్ణయించుకోవడంతో ట్రైలర్ ఆసక్తికరంగా మొదలవుతుంది. రాజీనామా తర్వాత ఏం చేస్తావంటే.. రాజకీయాల్లోకి వెళ్తానంటూ సూర్య చెప్పే డైలాగ్ నవ్వులు పూయిస్తుంది. కథలో భాగంగా ఓ ప్రమాదకరమైన, అత్యంత క్రూరమైన సైకో కిల్లర్ 'ఈశ్వర్' (నస్లెన్) ఆట కట్టించడానికి మాజీ పోలీస్ అయిన ఇన్‌బరాజ్ మళ్లీ రంగంలోకి దిగాల్సి వస్తుంది. సూర్యకు సమానమైన తెలివితేటలతో నస్లెన్ నడిపించే మైండ్ గేమ్స్, ఇద్దరి మధ్య జరిగే క్యాట్ అండ్ మౌస్ చేజ్ ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. ఇక చిత్రంలో 'మాయ' అనే పాత్రలో నటిస్తున్న నజ్రియా గ్లామర్‌తో పాటు కొన్ని పవర్‌ఫుల్ యాక్షన్ సన్నివేశాల్లోనూ కనిపించి అలరించారు. విలన్ బెదిరిస్తుంటే.. "అలెక్సా.. ఏదో ఒక మంచి మూడ్ మ్యూజిక్ ప్లే చెయ్" అంటూ సూర్య చెప్పే డైలాగ్ మరియు చివరిలో వచ్చే మాస్ విజువల్స్ సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. ఈ దీపావళి కానుకగా నవంబర్ 6న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో గ్రాండ్‌గా విడుదల కానుంది. మలయాళ సంగీత సంచలనం సుషిన్ శ్యామ్ ఈ చిత్రానికి సంగీతం అందిస్తుండగా.. జగరం స్టూడియోస్ మరియు 2డి ఎంటర్‌టైన్‌మెంట్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. ఈ సినిమా డిజిటల్ స్ట్రీమింగ్ హక్కులను ప్రముఖ సంస్థ నెట్‌ఫ్లిక్స్

గాడ్ ఆఫ్ వార్'కి ఢోకా లేనట్టే!



సుబ్రహ్మణ్యపురాణంలోని ఓ ఆసక్తికరమైన ఘట్టం ఆధారంగా అగ్ర దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఓ భారీ పానిండియా పౌరాణిక చిత్రాన్ని తెరకెక్కించనున్న విషయం తెలిసిందే. అగ్ర కథానాయకుడు ఎన్టీఆర్ నటించనున్న ఈ ప్రస్టేజియస్ ప్రాజెక్ట్‌కి 'గాడ్ ఆఫ్ వార్' అనే టైటిల్ ప్రచారంలో ఉన్నది. హారికా హాసినీ ప్రొడక్షన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ కలిసి నిర్మించనున్న ఈ చిత్రం విషయంలో ఇటీవల షాకింగ్ రూమర్లు బయటకి వచ్చాయి. ఈ చిత్రం మొదలవ్వడం కష్టమేనంటూ సోషల్ మీడియాలో కొందరు కథనాలను వండి వార్చారు.అంతేకాదు, హారికా హాసిని సంస్థ నుంచి త్రివిక్రమ్ దూరమైనట్టుగా కూడా రూమర్లు వచ్చాయి. వీటన్నింటికీ చెక్ పెడుతూ తాజాగా మేకర్స్ ఓ ఫొటోను రిలీజ్ చేశారు. ఈ ఫొటోలో ఎన్టీఆర్, త్రివిక్రమ్‌లతోపాటు నిర్మాతలు ఎస్.రాధాకృష్ణ, కల్యాణ్‌రామ్ కూడా ఉండటం విశేషం. దీంతో త్రివిక్రమ్, ఎన్టీఆర్‌ల 'గాడ్ ఆఫ్ వార్' సినిమా విషయంలో అభిమానుల్లో ఉన్న అనుమానాలు పటాపంచలైపోయాయి. త్వరలోనే ఈ క్రేజీ ప్రాజెక్ట్ సెట్స్ పైకి వెళ్లనున్నది. ఈ భారీ పౌరాణిక చిత్రానికి అనిరుధ్ సంగీతాన్ని అందిస్తారు. 'డ్రాగన్' తర్వాత ఎన్టీఆర్ ఈ సినిమా షూటింగ్‌లో జాయిన్ అవుతారు.

ఆ క్షణంలో కన్నీళ్లు ఆగలేదు!



నటీనటులకు కొన్ని పాత్రలు కేవలం గొప్ప జ్ఞాపకాలను మాత్రమే కాకుండా అంతకుమించిన భావోద్వేగాలను మిగుల్చుతాయి. ముఖ్యంగా ప్రజలు దైవాలుగా కొలిచే పౌరాణిక పాత్రల్ని చేస్తున్నప్పుడు ఆ అనుభూతి చాలా ప్రత్యేకంగా ఉంటుంది. అలాంటి ఓ అరుదైన అనుభవమే అగ్ర కథానాయిక సాయిపల్లవికి ఎదురైంది. ఇటీవల విడుదలైన 'రామాయణ: రైజ్ ఆఫ్ ఏ లెజెండ్' చిత్రంలో సాయిపల్లవి సీత పాత్రలో నటించిన విషయం తెలిసిందే. షూటింగ్ సమయంలో ఓ సన్నివేశం పూర్తికాగానే డైలాగ్ కోచ్ వచ్చి తన పాదాలకు నమస్కరించారని, ఆ క్షణంలో తాను భావోద్వేగాన్ని ఆపుకోలేక కన్నీళ్లు పెట్టుకున్నానని సాయిపల్లవి తెలిపారు.'మనం ప్రతీ రోజు పూజించే పాత్రను ఎవరైనా పోషిస్తున్నప్పుడు ఆ పాత్ర మీద పూజ్యభావం కలుగుతుంది. ఆమె ఓ సాధారణ మహిళే కదా అనే విషయాన్ని పట్టించుకోం. మనసులో ఉన్న ఆరాధనను వ్యక్తం చేయాలనుకుంటాం. ఆమె నా పాదాలను తాకినప్పుడు తను ఏడవకముందే నేను ఏడ్చాను. 'మీరు అసలు ఏం చేస్తున్నారు' అని అడిగాను. అప్పుడే సీతమ్మ పాత్ర ఎంత మంది హృదయాల్లో కొలువై ఉందో అర్థమైంది. ఆమె నాపై చూపించిన ప్రేమకు ఎంతో వినయంగా, భావోద్వేగంతో స్పందించాను' అని సాయిపల్లవి చెప్పింది. నితేష్ తివారి దర్శకత్వంలో రూపొందిన 'రామాయణ' చిత్రం ప్రపంచవ్యాప్తంగా వెయ్యికోట్లకుపైగా వసూళ్లతో దూసుకుపోతున్నది.

ప్రతీ మహిళా ఇష్టపడే సినిమా



'విశ్వనాథ్ అండ్ సన్స్,' 'ఇరుముడి' వంటి మ్యూజికల్ బ్లాక్‌బస్టర్స్‌తో ఈ ఏడాది సూపర్‌ఫామ్‌లో ఉన్నారు అగ్ర సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్‌కుమార్. ఆయన స్వరాల్ని అందించిన తాజా చిత్రం 'ఆకాశంలో ఒక తార'. దుల్కర్ సల్మాన్ హీరోగా పవన్ సాధినేని దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదలకానుంది. ఈ సందర్భంగా శుక్రవారం మ్యూజిక్ డైరెక్టర్ జీవీ ప్రకాశ్‌కుమార్ విలేకరులతో ముచ్చటిస్తూ సినిమా సంగీత విశేషాల్ని పంచుకున్నారు.లక్కీ భాస్కర్' తర్వాత దుల్కర్ సల్మాన్‌తో 'ఆకాశంలో ఒక తార' చేయడం ఆనందంగా ఉంది. మహిళా సాధికారతను తెలియజెప్పే స్ఫూర్తివంతమైన కథ ఇది. ఈ చిత్రానికి జాతీయ అవార్డులు వస్తాయనే నమ్మకం ఉంది. కుటుంబ ప్రేక్షకులందరికీ ఈ కథ నచ్చుతుంది. కథలోని ఎమోషన్స్‌ను బట్టి మ్యూజిక్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశాను. ఇదొక మోడరన్ క్లాసిక్ సినిమాలా ప్రేక్షకులకు గొప్ప అనుభూతినందిస్తుంది. ప్రతీ మహిళ ఇష్టపడే సినిమా అవుతుంది. ఈ సినిమా కోసం డిఫరెంట్ సౌండ్ డిజైన్ చేశాం. అందుకోసం స్పెషల్ సింథసైజర్స్‌ను ఉపయోగించాం. తప్పకుండా మ్యూజిక్ ఓ యూనిక్ ఫీల్‌ని అందిస్తుంది. ఇందులో మొత్తం ఐదు పాటలున్నాయి. పాటలు, నేపథ్య సంగీతం ఒకదానితో ఒకటి అనుసంధానమై ఉంటాయి. శృతిహాసన్‌తో ఓ పాట పాడించాం. అది త్వరలో విడుదల కాబోతున్నది. మ్యూజిక్, యాక్టింగ్‌ను బ్యాలెన్స్ చేస్తూ కెరీర్‌ను కొనసాగిస్తున్నా. 'లక్కీ భాస్కర్', 'ఇరుముడి', 'విశ్వనాథ్ అండ్ సన్స్' వంటి వరుస విజయాల వల్ల తెలుగులో అవకాశాలు బాగా పెరిగాయి. టాలీవుడ్ ప్రస్తుతం అద్భుతమైన దశలో ఉంది. దర్శకులు కొత్త కాన్సెప్ట్స్‌తో ముందుకొస్తున్నారు. అందుకే మ్యూజిక్ పరంగా కూడా కొత్తదనం కనిపిస్తున్నది. నేను నటించిన తాజా చిత్రం ఫిబ్రవరిలో రిలీజ్ కాబోతున్నది. అలాగే సెల్వరాఘవన్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్నా. ఇక మ్యూజిక్ పరంగా.. తెలుగులో 'జనవరి 12' 'శ్రీశ్రీ' చిత్రాలతో పాటు ఇటీవల మొదలైన సిద్ధు జొన్నలగడ్డ కొత్త చిత్రానికి పనిచేస్తున్నా.

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS M
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA